
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.5 । కనిష్ఠం 23.8

క్షేత్రస్థాయిలో రైతుల భూముల్లో సర్వే నిర్వహిస్తున్న అధికారులు



నెరవేరనున్న కల

» ఏళ్ల తరబడి నిరీక్షణకు తెర » అక్రమార్కులకు చెక్ పెట్టిన అధికారులు

» 4500 మంది రైతులకు లబ్ధి చేకూరేలా ఆమోద ముద్ర

ఎన్నో ఏళ్ల కష్టాలకు తెరపడనుంది. రెవెన్యూ రికార్డుల భూప్రక్షాళన చేసే క్రమంలో వివాదాస్పద భూములుగా పార్ట్-బీలో నమోదై, పాస్ పుస్తకాలు పొందలేక ఇబ్బందులకు గురవుతున్న కృష్ణపట్టితో పాటు పలు గ్రామాల రైతుల కష్టాలు తీరనున్నాయి. త్వరలోనే వారికి ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వనుండడంతో రైతుల కల సాకారం కానుంది.

- (ఆంధ్రజ్యోతి-తిరుమలగిరి(సాగర్))

మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆధ్వర్యంలో మంగళవారం అసైన్‌మెంట్ కమిటీ సమావేశమైంది. మండలంలోని 13గ్రామాలకు సంబంధించి 4వేలఎకరాలకు 4500మంది రైతులకు లబ్ధిచేకూరేలా ఆమోద ముద్ర పడడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తుంది.

రెవెన్యూ పైలట్ ప్రాజెక్టుగా..

మండలంలో ప్రభుత్వ, అటవీ, కాందీశికుల, ఎండోమెంట్ భూములతోపాటు, ప్రభుత్వ, ఫారెస్ట్ భూముల సరిహద్దులు, నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ముంపునకు గురైన గ్రామాల పునరావాస భూవివాదాలున్నాయి. ఇలాంటి క్లిష్టమైన భూసమస్యలు ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం తిరుమలగిరి(సాగర్) మండలాన్ని రెవెన్యూ పైలట్ ప్రాజెక్టుగా ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ క్రమంలో మండలంలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలకు పరిష్కారం చూపించే దిశగా సీసీఎల్ఏ ఆధ్వర్యంలో కలెక్టర్ నేతృత్వంలో వివిధ మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులతో పలు బృందాలను ఏర్పాటు చేశారు. ఈక్రమంలో ఆరు బృందాలను ఏర్పాటు చేసి ఒక్కో బృందంలో తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్లు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, మీసేవా సిబ్బందిని నియమించి నిర్దేశించిన రెవెన్యూ గ్రామాల్లో కాస్తు కబ్జాలో ఉన్న ప్రతీ ఎకరాన్ని రైతుల సమక్షంలోనే అంక్షాంశ, రేఖాంశాల ఆధారంగా హద్దులను నిర్ధారించారు. అక్కడికక్కడే రైతుల ఫొటోలను క్షేత్రస్థాయిలో తీసుకొని డిజిటలైజేషన్...

- మిగతా 8వ పేజీలో...

సర్వేలో పైలట్ ప్రాజెక్టులో భాగంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్న క్రమంలో రెవెన్యూ అధికారులకు గతంనుంచి వివాదస్పదంగా నమోదైన భూముల విషయంలో చోటు చేసుకున్న అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో ఈ ప్రాంతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు ఇష్టారీతిన వ్యవహరించి కాసులకు కక్కుర్తిపడడంతో ప్రధానంగా చింతలపాలెం, నెల్లికల్, తునికినూతల, తిమ్మాయిపాలెం రెవెన్యూ శివారుల్లో ప్రభుత్వ భూముల్లో కాస్తు కబ్జాలో లేనప్పటికీ సర్వే నెంబర్లలోని వాస్తవ విస్తీర్ణం కంటే అత్యధికంగా సుమారు 2వేల ఎకరాలకు పైగా అక్రమార్కులు పాస్ పుస్తకాలు పొందినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ప్రతీ రెవెన్యూ గ్రామ పరిధిలోని గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుకు సంబంధించిన బృందాలు

సర్వేలో వెలుగు చూసిన అక్రమాలు

ముందస్తుగా ఏరోజు ఏ సర్వే నెంబర్లలో, ఏ రెవెన్యూ సర్వే నెంబర్లలో సర్వే నిర్వహించనున్నారో ముందస్తుగా గతంలో ఎవరైతే పాస్ పుస్తకాలు పొందారో వారు ఖచ్చితంగా సంబంధిత సర్వే నెంబర్‌లోని తమ భూమి వద్దకు ఆధారాలతో రావాలని ఆదేశించారు. దీని వల్ల అక్రమార్కులు ఆధారాలులేకుండా పాస్ పుస్తకాలు పొందిన వందలాది మంది సర్వేలో పాల్గొనకపోవడంతో అనర్హులను ప్రకటిస్తూ సంబంధిత గ్రామపంచాయతీ నోటీస్‌బోర్డుల్లో వివరాలు సహా అంటించారు. దీంతో ఏయే సర్వే నెంబర్లలో ఎంతమంది గతంలో అక్రమంగా పాస్ పుస్తకాలు పొందారో ఎవరు అర్హుల్లో,ఎవరు అనర్హుల్లో అనే అంశంపై క్లారిటీతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం రాష్ట్ర యంత్రాంగానికి పూర్తి వివరాలను వివరించారు.

ఇకపై రిజిస్ట్రేషన్లకూ

స్లాట్ బుకింగ్

» 10 నుంచి 15 నిమిషాల్లో ప్రక్రియ పూర్తి

» పైలెట్ ప్రాజెక్టుగా భువనగిరి, చౌటుప్పల్ ఎస్ఆర్‌వోలు ఎంపిక

» రేపటి నుంచి మొదలు కానున్న నూతన విధానం

» త్వరలో ఉమ్మడి జిల్లాలోని మిగతా 13 కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్

రాష్ట్ర ప్రభుత్వం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానానికి శ్రీకారం చుడుతోంది. ఈ నూతన విధానంతో కేవలం 10 నుంచి 15 నిమిషాల్లోనే ప్రక్రియ పూర్తవుతుంది. ఆస్తుల క్రయవిక్రయదారులకు పారదర్శకత, అవినీతి రహితంగా మరింత మెరుగైన సేవలను సమర్థంగా అందించేందుకు సబ్ రిజస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్‌తోపాటు బయోమెట్రిక్ విధానాన్ని తీసుకరానున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

ప్రస్తుతం ఒక డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు కనీసం గంట నుంచి గంటన్నర సమయం పడుతుంది. స్లాట్ బుకింగ్ విధానం అయితే 10 నుంచి 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. గత నెలలో హైదరాబాద్‌లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఆస్తుల క్రయవిక్రయదారులు డాక్యుమెంట్ల నమోదుకోసం గంటల తరబడి నిరీక్షించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీని దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆధునికీకరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ చాట్‌బోర్డు సేవలు వినియోగించుకోనున్నారు.

పైలెట్ ప్రాజెక్టుగా భువనగిరి, చౌటుప్పల్

పైలెట్ ప్రాజెక్టుగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్, భువనగిరి కార్యాలయాలను ఎంపిక చేశారు. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్...

- మిగతా 7వ పేజీలో...



ఎన్ని మిల్లులు తిరిగినా..

» ధాన్యం లోడు ట్రాక్టర్లతో మిల్లుమిల్లు తిరుగుతున్న రైతులు

» కొత్త నిబంధనలు పెడుతున్నారంటూ నార్కట్‌పల్లి- అద్దంకి హైవేపై రైతుల రాస్తారోకో

» మద్దతు ధర ఇవ్వడం లేదని శెట్టిపాలెంలో ఆందోళన



మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి రోడ్డులో రైస్‌మిల్లు ఎదుట బారులు తీరిన ధాన్యం లోడు ట్రాక్టర్లు

మిర్యాలగూడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన పంట విక్రయించేందుకు రైతులకు కష్టాలు మొదలయ్యాయి. ఎండనక.. వాననక.. కంటికి రెప్పలా కాపాడుకున్న పంటను కోతకోసి.. కుప్పనూర్చి.. మార్కెట్ తెస్తే కొనేవారు లేక ఒక చోట.. తాలు పేరుతో ఐదు రోజులుగా కాంటాలు ఆపుతున్నారని మరోచోట.. మద్దతు ధర ఇవ్వడం లేదని ఇంకో చోట.. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను పట్టించుకునేవారు కానరాకపోవడంతో రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంగళవారం ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. తిప్పర్తి మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డులో రైతులనుంచి కొనుగోలు చేసిన ధాన్యంలో ఎక్కువతాలు ఉందంటూ లోడ్ లారీలను మిల్లు నిర్వాహకులు దిగుమతి చేసుకునేందుకు నిరాకరించారు. దీంతో నార్కట్‌పల్లి-అద్దంకి హైవేపై రైతులు రాస్తారోకో చేశారు. మిల్లర్లు మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని వేములపల్లి మండలం శెట్టిపాలెం వద్ద రైతులు నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అదే విధంగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తమ్మర గ్రామ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కోదాడ పట్టణంలోని ఖమ్మం-కోదాడ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

- వివరాలు 7లో...

నాణ్యమైన వైద్యం అందించాలి

● కలెక్టర్ ఇలాత్రిపాఠి



తిప్పర్తి ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

తిప్పర్తి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. తిప్పర్తి మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న నూతన భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలోని సిబ్బంది హాజరు పట్టిక చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డ్యూటీ డాక్టర్ మమత తో మాట్లాడుతూ ఓపీలు, వైద్య సేవలు, సమస్యల వం టి విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికంగా ఉన్న మోడల్ స్కూల్ లైబ్రరీని పరిశీలించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆమెవెంట డీపీవో వెంకయ్య, తహసీల్దార్ పరుశరాములు, ఎంపీడీవో ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ బి.సాయి ప్రశాంత్, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్: మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు, అధికారులతో ఈ నెల 11న నిర్వహించే జ్యోతిబాపూలే జయంతి వేడుకల ఏర్పాట్లపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహనీయుల జయంతులను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యంతో పేదలకు మేలు

మాడ్గులపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సన్న బియ్యం పథకంతో పేదలకు మేలు జరుగుతుందని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. మంగళవారం మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామంలో సన్న బియ్యం లబ్ధిదారురాలు రేఖా జానకమ్మ ఇంట్లో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, జిల్లా పౌరసరఫరాలశాఖ ఇన్‌చార్జి అధికారి హరీష్‌కుమార్‌తో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సన్నబియ్యం పథకం చరిత్రలో నిలిచిపోతుందని, గతంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత పథకం కింద దేశ వ్యాప్తంగా బియ్యం పంపిణీ చేసిందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉచిత బియ్యం పంపిణీ జరిగిందన్నారు.సన్నబియ్యం పథకంతో గ్రామాల్లో లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని, సన్న బియ్యాన్ని సక్రమంగా అన్ని రేషన్‌షాపులకు తరలించామన్నారు. తొమ్మిది ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద వెయ్యింగ్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశామని,ఎక్కడ లోపాలు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. అంతకుముందు కలెక్టర్ పాములపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవలను డాక్టర్ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో తాగునీటి సమస్య ఉందని కలెక్టర్‌దృష్టికి తీసుకురావడంతో తక్షణమే మోటార్, బోరును మంజూరు చేశారు. అంతేకాకుండా ఆసుపత్రికి వచ్చేరోగులకు ఇబ్బందుల్లేకుండా, వేసవి దృష్ట్యా రెండు ఏసీలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో తిరుమలస్వామి, వైద్యాధికారులు సత్యనారాయణ, సంజయ్, మాజీ జడ్పీటీసీ పల్లెంల సైదులు పాల్గొన్నారు.

ఎదుళ్ల-డిండి పనులకు రూ.1800 కోట్లు

» పరిపాలన ఆమోదం జారీ చేసిన ప్రభుత్వం » దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, నీటిపారుదలశాఖ ఛీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్, అధికారులు

దేవరకొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1800 కోట్లు కేటాయించింది. ఎదుళ్ల నుంచి డిండి అనుసంధాన ప్రాజెక్టు పనులకు పరిపాలన ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దేవరకొండలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన నీటిపారుదలశాఖ, రెవెన్యూ ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిండి ఎత్తిపోతల, ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి ప్రాజెక్టుల ను పూర్తిచేసి జిల్లాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఎదుళ్ల రిజర్వాయర్ నుంచి సింగరాజుపల్లి, గొట్టిముక్కల, కిష్టరాయన్‌పల్లి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయడమే లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎదుళ్ల, ఉల్పర అనుసంధాన పనులకు రూ.1800.62 కోట్ల అంచనాలతో పరిపాలన ఆమోదం తెలిపినట్లు తెలిపారు. డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తయితే దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగునీరు అందుతుందన్నారు. జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ప్రాజెక్టుల కింద భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం కల్పించాలని అధికారులను కోరారు. ప్రాజెక్టుల్లో భూములు కోల్పోతున్న రైతులందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందజేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్, స్పెషల్ కలెక్టర్ నటరాజన్, నీటి పారుదలశాఖ సీఈ అజయ్‌కుమార్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, చండూరు ఆర్డీవో శ్రీదేవి పాల్గొన్నారు.

25వేల ఎకరాల ఆయకట్టు పెంచే

దిశగా ప్రణాళిక

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



బ్రాహ్మణ వెల్లెంల లెఫ్ట్ మెయిన్ కెనాల్ ప్రణాళికను మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి చూపిస్తున్న అధికారులు

మునుగోడు రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మునుగోడును సస్యశ్యామలం చేసేందుకు ఉరుమడ్ల గ్రామం నుంచి కిష్టాపురం వరకు 11.5 కిలోమీటర్ల మేర బ్రాహ్మణ వెల్లెంల లెఫ్ట్ మెయిన్ కెనాల్ విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఉదయ సముద్రం అధికారులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మునుగోడు మండలంలో కృష్ణానీటితో 25వేల ఎకరాల ఆయకట్టును పెంచే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం ఉరుమడ్ల గ్రామం వరకే ఉన్న బ్రాహ్మణ వెల్లెంల లెఫ్ట్ మెయిన్ కెనాల్‌ను కిష్టాపురం గ్రామం వరకు 11.5కిలోమీటర్ల మేర విస్తరించి వీలైనంత ఆయకట్టుకు నీటిని అందించే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు మొదలు పెట్టాలన్నారు. భవిష్యత్తులో అవసరమైతే కిష్టాపురం చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చుకొని అక్కడి నుంచి ఎగువ ప్రాంతానికి లిఫ్టుల ద్వారా నీరందించాలన్నారు. ఈ సమావేశంలో ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డీఈ విటలేశ్వర్, ఏఈఈ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీపీఎం డి.మోహన్‌రెడ్డి

కనగల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీపీఎం డి. మోహన్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని కనగల్, పర్వతగిరి, కురంపల్లి, జీఎడవల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. నిర్వాహకులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాంటా వేసిన ధాన్యం బస్తాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సూచించారు. కొనుగలు కేంద్రాల వద్ద రైతులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సంకు హరి, సీసీలు ప్రభాకర్, విజయ, వసంత, సీఆర్‌పీ జానకి తదితరులు ఉన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



బీఆర్ఎస్ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవీంద్రకుమార్

దేవరకొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ ఆవిర్భావ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ పిలుపునిచ్చారు. దేవరకొండలో మంగళవారం బహిరంగసభ పోస్టర్‌ను విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా వ్యతిరేకతను వరంగల్ సభ వేదికగా ఎండగడుతామన్నారు.

పార్టీ ఆవిర్భావ రజతోత్సవాల్లో భాగంగా పల్లెలు, పట్టణాల్లో గులాబీ జెండాలు ఎగరవేయాలని కోరారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం పేద ప్రజల జీవితాలను నాశనం చేసిందన్నారు. రుణమాఫీ చేస్తామని రైతులకు మాయమాటలు చెప్పి పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జర్పుల లోక్యనాయక్, మాధవరం జనార్ధన్‌రావు, గాజుల రాజేష్, కేతావత్ శంకర్‌నాయక్, కేతావత్ రవీందర్, బొడ్డుపల్లి కృష్ణ, జానిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా కార్లు ఢీ : ఒకరి మృతి

● 11 మందికి గాయాలు

● మృతుడు బోడుప్పల్ వాసి



6

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

జిల్లా అదనపు పీడీ నవీన్‌కుమార్



కమ్మగూడెం నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అదనపు పీడీ నవీన్ కుమార్


మర్రిగూడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం పనులను పారదర్శకంగా చేపట్టాలని జిల్లా అదనపు పీడీ నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని లెంకలపల్లి, కమ్మగూడెంలో చేపడుతున్న భూమి అభివృద్ధి పనులు, నర్సరీలను మంగళవారం ఆయన పరిశీలించారు. కమ్మగూడెం నర్సరీలో పని చేస్తున్న మహిళా కూలీతో మాట్లాడారు. రోజు వారీగా కూలి ఎంత వస్తుందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు వంద రోజుల ఉపాధి పనులు కల్పించి రోజుకు రూ.307 కూలి వచ్చే విధంగా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు, ఉపాధి అధికారులకు సూచించారు. కూలీలకు ఉపాధి కల్పించడంతో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా వేసవిలో నర్సరీలో పెట్టిన మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించి వాటిని పరిరక్షించాలన్నారు. ఆయన వెంట ఏపీడీవో యామిని, ఎంపీడీవో మున్నయ్య, ఏపీవో వివేక్, ఫీల్డ్ అసిస్టెంట్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్రంబోడు గోస వినరూ



పేద రైతుల బతుకు పోరాటంగా నిలిచి, నేతల హామీలు, పోలీసుల పహారాలు, నిత్యం ఆందోళనలు, ఆవేదనలు, ఆశా, నిరాశలతో నిండిన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం గుర్రంబోడుతండాలోని 540 సర్వేనెంబరులోని భూసమస్యకు నేటికీ పరిష్కారం లభించలేదు. రెండేళ్ల కిందట అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ 'రైతు భరోసాయాత్ర' పేరుతో చేపట్టిన కార్యక్రమంలో రచ్చ జరిగి ఈ తండా సమస్య రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆ తర్వాత సర్వేలు, నివేదికలు, అధికారులు సస్పెన్షన్లతో కాలం గడిచిందే తప్ప నిర్దిష్టమైన సమాధానం ప్రభుత్వాల నుంచి రైతులకు అందలేదు. వెరసి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది.

- (ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)



గుర్రంబోడుతండాలోని 540 సర్వేనంబర్‌లో భూములు

- కొలిక్కిరాని 540 సర్వే నెంబరు భూ వివాదం
- గొడవలు, ఆందోళనతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం
- అర్హులకు జరగని న్యాయం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు అప్పటి ప్రభుత్వం మఠంపల్లి మండలం పెద్దవీడు పంచాయతీ పరిధి 540 సర్వేనెంబరులోని గుట్టల భూమిని ఇచ్చింది. 50ఏళ్ల క్రితం ఉన్న చట్టాలకు అనుగుణంగా గిరిజన రైతులకు పూర్తి హక్కులు కల్పిస్తూ డీఫాంలు జారీ చేసింది. కానీ రైతులకు హద్దులతో కూడిన భూమిని అప్పగించలేదు. దీంతో భూనిర్వాసితులు సర్వే నెంబరులోని కనబడిన భూములను గిరిజనులు సాగు చేసుకుంటూ వస్తున్నారు. పదుల సంఖ్యలో ఉన్న రైతుల కుటుంబాలు, వారసులు పెరుగుతూ వందల సంఖ్యలోకి వచ్చారు. ఎవరి భూమి ఎవరు సాగు చేసుకుంటున్నారో, పట్టా ఎవరి పేరున ఉందో, కబ్జాలో ఎవరు ఉన్నారో వారికే తెలియని పరిస్థితి. గుడ్డి నమ్మకంతో వ్యవసాయం చేస్తూ బతుకుతున్న గిరిజనులకు మారుతున్న ప్రభుత్వాలు హక్కులను కల్పించడంలో నిర్లక్ష్యం వహించాయి. రెవెన్యూ నక్ష ప్రకారం డీఫాం ఆధారంగా రైతులు ఉంటున్న భూములపై పాస్‌పుస్తకాలు జారీ చేసి ఉంటే కొంత మేలు జరిగి ఉండేది. అలాంటివి ఇక్కడ అమలు చేయలేదు. కాలంతో పాటు పెరిగిన కుటుంబాలు తండా నుంచి పంచాయతీగా ఎదిగిన ఊరు ఒక్కసారిగా రెక్కలు తొడిగిన భూముల ధరలతో కబ్జాదారుల కన్నుపడింది. ఈ క్రమంలోనే 540 సర్వే నెంబరులో 1,873 ఎకరాల రైతుల భూమిని ఆరు వేలకు ఎకరాలకు పెంచి తప్పుడు రికార్డులను సృష్టించి ప్రైవేట్ కంపెనీలు, బడాబాబులకు కట్టబెట్టారు. తప్పిదాలను సరిదిద్దకపోగా అధికారులు, ప్రజా ప్రతినిధులు అక్రమార్కులకు కొమ్ముకాశారు.

క్షేత్రస్థాయిలో సర్వే జరిగి ఉంటే..

గుర్రంబోడుతండా భూవివాద నేపథ్యంలో అప్పటి సూర్యాపేట జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, రిటైర్డ్ ఆర్డీవో భిక్షంనాయక్ గిరిజనుల వినతుల మేరకు గుర్రంబోడుతండా తండాను సందర్శించారు. ఆయా భూముల్లో పర్యటించి రైతులకు జరిగిన అన్యాయాన్ని గుర్తించి అక్రమాలపై 20 రోజుల్లో పూర్తిస్థాయి సర్వేచేసి 30 రోజుల్లో అర్హులైన రైతులకు స్వయంగా తండా రైతులు, పెద్దల సమక్షంలో పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చి వెళ్లారు. అనంతరం 2023 నవంబరులో 540 సర్వేనంబర్‌లో సర్వే చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పూర్తి సమాచారాన్ని అందించాలని సూచించినా కిందిస్థాయి అధికారులు ఆ మేరకు బాధ్యతగా పనిచేయలేకపోయారు. 540 సర్వే నంబర్‌లో భూముల వివరాలకు అనుగుణంగా రైతులను కలవడం, హక్కుదారులను గుర్తించడం, సాగులో ఉన్న భూములు పరిశీలించడం, కబ్జాలో ఉన్న రైతుల పేర్లు నమోదు చేయకపోవడం, తూతుమంత్రంగా చేసిన సర్వేలో రైతుల భూములను హద్దులను గుర్తించకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా సర్వే చేశారనే ఆరోపణలు బలంగా వినిపించాయి. భూనిర్వాసితులకు ఇచ్చిన భూమి ఎంత మేరకు ఆక్రమణకు గురైందో సర్వేలో నిర్దిష్టంగా తేల్చలేదు. కలెక్టర్ ఆదేశాలు ఖచ్చితంగా పాటించి మండల స్థాయి అధికారులు, వీఆర్వోలు, సర్వేయర్లు క్షేత్రస్థాయిలో రైతులందరినీ కలిసి ఉంటే వివాదం పరిష్కారమయ్యేదని, అర్హులైన రైతులకు న్యాయం జరిగేదని స్థానిక రైతులు అభిప్రాయపడుతున్నారు.

సరి దిద్దాలంటే?

ముందు రైతులకు న్యాయం జరగాలన్నా, గతంలో జరిగిన తప్పులు సరిదిద్దాలన్నా, రెవెన్యూ శాఖ కీలకమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. 540 సర్వే భూములను ప్రక్షాళన చేసి అక్రమదారులను గుర్తించి సాగులో ఉన్న రైతులకు పాస్ పుస్తకాలు, హక్కులు కల్పించి కబ్జాదారులను ఖాళీ చేయించడం, అర్హులైన గిరిజన రైతులుంటే పట్టాలు ఇవ్వడం ద్వారా సమస్యకు పరిష్కారం లభించినట్లవుతుంది. ఇది సాధ్యమవ్వాలంటే ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.



సాగు చేసుకుంటున్న గిరిజన పేద రైతులు

కనిపించని చర్యలు ....

గుర్రంబోడుతండాలో 540 సర్వే నెంబరులో ఆరు వేల ఎకరాలకు పెరిగిన భూమి రికార్డుపరంగా జరిగిన తప్పులు సరిదిద్దే ప్రయత్నం జరగడం లేదు. ఇప్పటికే జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోకపోవడం కాని లేకపోవడంతో గుర్రంబోడుతండా రైతుల గోడు అలాగే మిగిలి ఉంది. పూర్తిస్థాయిలో సర్వేలు జరగకపోవడం వెనక అధికార పార్టీ నేతల అండదండలు ఉన్నాయనే విమర్శలు నిజం అనుకునేలా పరిస్థితులు ఉన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు కోర్టులను ఆశ్రయించినప్పుడే కొంత కదలిక వచ్చి అధికారులు చర్యలు తీసుకున్నారే తప్ప, ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీ అమలుకాకుండాపోయింది.

120 ఎకరాల సంగతేంటి?

భూవివాదంపై విచారణలు, సర్వేలు కొనసాగుతుండగానే ఇటీవల 120 ఎకరాల భూమి పలువురు రైతులకు చెందినవేనని జరుగుతున్న ప్రచారంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. 1,876 ఎకరాలకు నకిలీ పట్టాలు, తప్పుడు పట్టాలు సృష్టించి 6వేల ఎకరాలకు పెంచి అక్రమాలకు పాల్పడిన వారిని వదిలి 120 ఎకరాలను గుర్తించినట్లు బీఆర్ఎస్ నేతలు కొందరులు చేసిన ప్రచారం వివాదాస్పదంగా మారింది. ఈ ప్రచారాన్ని అధికారులు కొట్టివేయడం లేదని, అధికారులు నోరు విప్పకపోవడంతో కొందరు నాయకులు 120 ఎకరాలను కూడా కాజేసేందుకు ఆడుతున్న నాటకంగా రైతులు అనుమానిస్తున్నారు.

భూములు వదిలే ప్రసక్తే లేదు



కొద్దిపాటి ఉన్న భూములను సేద్యం చేసుకోవడంతో పాటు మరికొంత భూమిలో కబ్జాలో ఉంటూ జీవనం గడుపుతున్నాం. మా భూములను లాక్కోవాలనే ప్రయత్నాలు చేస్తే ఆత్మహత్యకు వెనకాడం, భూములు వదులకోం. మా వద్దపట్టాలు ఉన్నాయి. భూస్వాములకు ఎవరు విక్రయించారో వారిని తీసుకురమ్మనండి. ఆ భూములను చూపమనండి. మేం ఎవరికీ భూములు విక్రయించలేదు. మా భూముల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. దికారులు వాస్తవాలు గుర్తించి న్యాయం చేయాలి.

- రమావత్ దీప్లానాయక్

కోర్టుల చుట్టూ తిరుగుతున్నాం



రెండు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న మా భూములకు పట్టాలు ఇవ్వాలని అడిగినందుకు కేసు బనాయించారు. 45 రోజులు జైలు జీవితం గడిపా. మా గోడును వినిపించుకోకుండా అధికారులు దళారుల మాటలు నమ్మి మాకు పట్టాలు రాకుండా చేశారు. నాతో పాటు గుర్రంబోడుతండాకు చెందిన మరో 40మందిపై అక్రమ కేసులు పెట్టారు. నేటికీ కోర్టు చుట్టూ తిరుగుతున్నాం.

- రమావత్ లచ్చిరాంనాయక్, గుర్రంబోడుతండా

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లా



గుర్రంబోడుతండా గిరిజనుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. ప్రభుత్వం సర్వే నెంబరులో కొన్ని వివాదాల కారణంగా ప్రభుత్వం హోల్డ్‌లో పెట్టింది. భూములను సర్వే చేయాలని ఒత్తిడిలు వస్తున్నా, ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పేద గిరిజన రైతులకు న్యాయం జరిగేలా తనవంతు కృషి చేస్తా. పేదలందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటా.

- మంగా రాథోడ్, తహసీల్దార్

ఎదురెదురుగా కార్లు ఢీకొని వ్యక్తి మృతి

- 11 మందికి గాయాలు
- మృతుడు బోడుప్పల్ వాసి

నల్లగొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, 11 మందికి తీవ్రగాయాలయ్యాయి. నల్లగొండ టూ టౌన్ ఎస్ఐ ఎర్ర సైదులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా దాచేపల్లి నుంచి ఏపీ39డీజడ్-1445 నంబరు అద్దె కారులో షేక్ ఫిరోజ్, అతడి కుటుంబ సభ్యులు హజ్ యాత్రకు బయలుదేరారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్తున్నారు. 11.30 సమయంలో నల్లగొండ పట్టణంలోని లెప్రసీ కాలనీలోని పానగల్లు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో హైదరాబాద్ వైపు నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న టీఎస్08హెచ్ఎఫ్5115 నంబరు కారు ఎదురెదురుగా ఢీకొని రెండు కార్లు పల్టీలు కొట్టాయి. ఈ ఘటనలో రెండు వాహనాల్లో ఉన్న వారికి బలమైన గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న 108 వాహనాల్లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. హైదరాబాద్‌లోని బోడుప్పల్ నుంచి ఒంగోలుకు వెళ్తున్న వ్యాగనార్ కారులో ప్రయాణిస్తున్న పీ.రఘురాంమూర్తి(80) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో రఘురాంమూర్తి సతీమణి స్వరాజ్యలక్ష్మి, కారు నడుపుతున్న ఆయన కుమారుడు ఆనిల్‌కు గాయాలయ్యాయి. రఘురాంమూర్తి కుటుంబ సభ్యులు ఒంగోలులో పూజలు నిర్వహించేందుకు వెళ్తున్నట్లు తెలిసింది. అదేవిధంగా హజ్ యాత్రకు బయలుదేరిన షైమూద్‌కి తీవ్ర గాయాలుకావడంతో పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్ఐ తెలిపారు..



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి వెళుతూ....



రాంబాబు(ఫైల్)

మోత్కూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : బంధువు అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి ఇంటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలంలో జరిగింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన చెరుకు రాంబాబు(25)కు వరుసకు మేనత్త అయిన బోడ సోమనర్సమ్మ ఈ నెల 6న మోత్కూరు పరిధిలోని కొండగడప గ్రామంలో మృతి చెందింది. ఈ నెల 7న నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొనడానికి రాంబాబు(25) బైక్(టీఎస్29ఆర్ 1181)పై కొండగడపకు వచ్చారు. అంత్యక్రియలు ముగిసిన అనంతరం సోమవారం రాత్రి ఆయన అదేబైక్‌పై తిరిగి ఇంటికి వెళుతూ పాటిమట్ల క్రాస్‌రోడ్డులో నిలిచి ఉన్న ట్రాలీ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాంబాబు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనాన్ని రోడ్డుపై నిలిపి ఉంచడం, పార్కింగ్ లైట్లు వేయకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని మృతుని బంధువులు ఆరోపించారు. రాంబాబు బావ కందుకూరి శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ప్రమాదవశాత్తు భవన నిర్మాణ కార్మికురాలు మృతి

చౌటుప్పల్‌రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు ఓ భవన నిర్మాణ కార్మికురాలు మృతి చెందింది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పంతంగి గ్రామానికి చెందిన మల్లెవేణి సుగుణమ్మ(50) భవన నిర్మాణ కార్మికురాలిగా పనిచేస్తోంది. మంగళవారం (ఎస్)లింగోటంలోని ఉప్పు వెంకటేశ్ గృహ నిర్మాణంలో భాగంగా మెట్ల పరంజ కూలిపోవడంతో కిందపడిపోయింది. తలకు తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. సుగుణమ్మ కుమారుడు మల్లెవేణి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి..



వాగయ్య మృతదేహం

సూర్యాపేట క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లాకేంద్రంలో మంగళవారం జరిగింది. సూర్యాపేటకు చెందిన కోల నాగయ్య(43) కూరగాయల మార్కెట్‌లోని ఓ చికెన్ దుకాణంలో పనిచేస్తున్నాడు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. నాగయ్యకు భార్య, కుమార్తె ఉంది. భార్య భవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరరాఘవులు తెలిపారు.

మృతదేహం లభ్యం

వలిగొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ-నాగిరెడ్డిపల్లి రైల్వేస్టేషన్ నడుమ గుర్తుపట్టడానికి వీలులేకుండా కుళ్లిపోయిన ఒక వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు 30 నుంచి 35 వయస్సు ఉండొచ్చని, శరీరంపై నలుపురంగు ఫుల్‌టీషర్ట్ సిమెంట్ కలర్ పాయింట్ ఉందని పోలీసులు తెలిపారు. రైలు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. నల్లగొండ రైల్వే సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మృతుడి సమాచారం తెలిస్తే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులు అరెస్టు



విలేకరులకు వివరాలు తెలుపుతున్న పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు

సూర్యాపేట క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులను సూర్యాపేట జిల్లా కేంద్ర పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కిలోకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ పీ వీరరాఘవులు మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వెల్లడించారు. సూర్యాపేట పట్టణ పోలీసులు ఈ నెల 7వ తేదీన సాయంత్రం సూర్యాపేట పట్టణ శివారులోని రాజీవ్ పార్క్ వద్ద జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో చివ్వెంల మండలం కుడకుడ సమీపంలోని స్నేహనగర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్‌గా పనిచేసే గాజుల ప్రవీణ్, చివ్వెంల మండలం మున్యానాయక్‌తండాకు చెందిన విద్యార్థి బానోతు మహేష్‌నాయక్ కోదాడ వైపు నుంచి బైక్‌పై సూర్యాపేట పట్టణానికి వస్తున్నారు. పట్టణ పోలీసులు వారి బైకును ఆపి వాహన కాగితాలు చూపించమన్నారు. వాహన కాగితాలు లేకపోవడం, బైక్‌నెంబర్ లేక పోవడంతో అనుమానంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీచేయగా అందులో గంజాయి లభించింది. వెంటనే ఇద్దరిని స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించారు. ఇద్దరు యువకులు కొన్నాళ్లలగా ఆంధ్రప్రదేశ్‌లోని అరుకు ప్రాంతానికి వెళ్లి అక్కడ గంజాయిని కొనుగోలు చేసి సూర్యాపేటకు తరలించి పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు అంగీకరించారు. దీంతో ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి సుమారు కిలో 20గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కోర్టుకు రిమాండ్‌కు పంపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్ఐలు వాస ప్రవీణ్‌కుమార్, ఏడుకొండలు, సిబ్బంది గొర్ల కృష్ణయ్య, గోదేసి కర్ణాకర్, డార్విన్, తరుణ్, చీకూరి మధు తదితరులు ఉన్నారు.

అంతర్రాష్ట్ర సిగరెట్ దొంగల ముఠా అరెస్టు

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర సిగరెట్ దొంగల ముఠాను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లక్ష్మణ్, రాకేష్ కుమావత్, దినేష్, అశోక్‌జాట్, భరత్‌కుమార్‌లు ముఠాగా ఏర్పడి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సిగరెట్ డీలర్ల దుకాణాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది మార్చి 6న చౌటుప్పల్‌లోని బాలాజీ కిరాణం దుకాణంలో రూ.15లక్షల విలువైన సిగరెట్ పెట్టిలను చోరీచేశారు. మంగళవారం చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం ఆందోల్‌మైసమ్మ దేవాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ముఠా సభ్యుల కారు ఒక్కసారిగా ఆగిపోయింది. కారులో నుంచి దొంగలు పారిపోతుండగా పోలీసులు పట్టుకుని విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించారు. పట్టుబడిన దొంగలను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. దుకాణ యజమాని వూర కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బూరుగడ్డ ప్రభుత్వ పాఠశాలలో అగ్ని ప్రమాదం

హుజూర్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. పాఠశాల తరగతి గది పక్కన చెత్తాచెదారం ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పువేయడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో పాఠశాల వంటగది నిర్మాణంలో ఉన్న మేస్త్రీలు, కూలీలు మంటలు ఆర్పారు. ఒక్క పూట బడులు కావడంతో విద్యార్థులు పాఠశాలలో లేకపోవడంతో ఎవరికీ ఏమీ కాలేదు. మంటలు ఆర్పిన తరువాత ఉపాధ్యాయులకు సమాచారం అందించడంతో వారు పాఠశాలను పరిశీలించారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చెత్తను తొలగిస్తామని ఉపాధ్యాయులు తెలిపారు.

అశ్లీల వీడియోలు పంపిన వ్యక్తి అరెస్ట్

హుజూర్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : బాలల అశ్లీల వీడియోలను డౌన్‌లోడ్ చేసి షేర్ చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపారు. మంగళవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజూర్‌నగర్‌లోని గాంధీపార్క్ సెంటర్‌లో నివాసముంటున్న కే శ్రీనివాసరావు గత నాలుగేళ్ల నుంచి సెల్‌ఫోన్‌కు బానిసయ్యాడని తెలిపారు. ప్లే స్టోర్ నుంచి మెసెంజర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని యాప్‌లో అశ్లీల వీడియోలు చూస్తూ 2022 సెప్టెంబరులో బాలల అశ్లీల వీడియోలు చూస్తూ యాప్‌లో ఉన్న ఇతర గ్రూపులకు షేర్ చేశాడు. రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ అధికారులు దీనిని గమనించినట్లు సీఐ తెలిపారు. కాగా హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు సైబర్ సెక్యూరిటీ అధికారులు ఫిర్యాదు పంపగా ఎస్ఐ ముత్తయ్య కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా ఈ మేరకు కే శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని విచారించగా అతడు చేసిన తప్పును ఒప్పుకున్నట్లు తెలిపారు. అతడి నుంచి సెల్‌ఫోన్, సిమ్‌కార్డు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు సీఐ చరమందరాజు తెలిపారు. కాగా సీఐ మాట్లాడుతూ సైబర్ అధికారులు నిరంతరం నిఘా ఉంచారని, ఎలాంటి లింక్‌లు డౌన్‌లోడ్ చేసినా, పంపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చింతపల్లి మద్యం దుకాణంలో చోరీ



వైన్స్ షాప్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

చింతపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతలపల్లి మండల కేంద్రంలో మద్యం దుకాణంలో చోరీ జరిగింది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రంలోని దుర్గా మద్యం దుకాణంలో రోజు మాదిరిగానే మద్యం విక్రయించి తాళం వేసుకుని వెళ్లిపోయారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించి రూ.15 విలువైన మద్యం సీసాలను చోరీ చేశారు. వైన్స్ క్యాషియర్ గడిగ రాజు మంగళవారం దుకాణానికి వచ్చిన సమయంలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో ..

దామరచర్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఒకే ఇంటిలోని రెండు పోర్షన్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దామరచర్లలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన గజ్జెల ఇంద్రారెడ్డి, కుటుంబసభ్యులు పనినిమిత్తం బయటకువెళ్లారు. అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న విజయ్ కుటుంబసభ్యులు కూడా బయటకువెళ్లారు. కొంతసమయం తరువాత తిరిగి వచ్చి చూసుకోగా ఆయా ఇళ్లలో చోరీ జరిగినట్లు కుటుంబసభ్యులు గుర్తించారు. ఇంద్రారెడ్డి ఇంట్లో రూ.50వేల విలువైన ఆరు గ్రాముల బంగారం, విజయ్ ఇంట్లో రూ.25వేల నగదును చోరీకి గురైంది. దీంతో ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.

నిందితుడికి ఆరు నెలల జైలు


కట్టంగూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా, అజాగ్రత్తగా ఆర్టీసీ బస్సు నడుపుతూ ఓ ప్రయాణికుడి మృతికి కారణమైన ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్‌కు ఆరునెలలు జైలు, రూ.2వేలు జరిమానా విధిస్తూ నకిరేకల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ ఆరీఫ్ మంగళవారం తీర్పు ఇచ్చినట్లు కట్టంగూరు ఎస్ఐ ఎం రవీందర్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం 2014 డిసెంబరు 9న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు డిపోకు చెందిన ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్ బొమ్మాజి మోహన్ ఏలూరు నుంచి ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమ్యాలో కట్టంగూరు మండలం పామనగుండ్ల గ్రామశివారులోకి రాగానే హైవేపై ఆగిఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు మృతి చెందగా మరో ఎనిమిదిమంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈప్రమాదంపై అప్పటి ఎస్ఐ విజయ్‌ప్రకాష్ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నకిరేకల్ కోర్టులో చార్జిషీట్ దాఖలుచేశారు. కేసు విచారణ అనంతరం మంగళవారం డ్రైవర్ మోహన్‌కు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని ఎస్ఐ తెలిపారు.

నిలిచిన బుద్ధవనం అభివృద్ధి పనులు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యాటక కేంద్రం, అంతర్జాతీయ బౌద్ధక్షేత్రమైన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బుద్ధవనం ప్రాజెక్టులో చేపట్టిన అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. 274 ఎకరాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన పనుల్లో కొన్ని అసంపూర్తిగా ఉండగా, మరికొన్ని కొనసాగుతున్నాయి. మరికొన్ని పనులకు కనీసం టెండర్లు కూడా ఖరారు కాలేదు. రూ.25 కోట్ల వ్యయంతో డిజిటల్ మ్యూజియాన్ని ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం మహాస్థూపం ముందున్న స్థలాన్ని కూడా పర్యాటక శాఖ అధికారులు పరిశీలించి, ప్రతిపాదించారు. కానీ ఆ పనులకు సంబంధించి నేటికీ కనీసం టెండర్లు ఖరారుకాలేదు. అంతేకాకుండా రూ.1.60 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 18 దుకాణాల సముదాయం పనులు స్లాబ్ లెవల్ వరకు వచ్చి ఆగిపోయాయి. అలాగే రూ.1.60 కోట్లతో 2500 విగ్రహ నమూనాలతో నిర్మించతలపెట్టిన జర్నీ ఆఫ్ అశోకా స్థూపం పనులు ప్రారంభించలేదు. రూ.130 లక్షలతో నిర్మించ తలపెట్టిన గ్రానైట్ పార్కింగ్ పనులు మొదలుకాలేదు. ప్రస్తుతం రూ.8 లక్షలతో క్లాక్ రూం, రూ.35 లక్షలతో వాటర్ ట్యాంకు పనులు పూర్తయ్యాయి. రూ.1.05 కోట్లతో వాటర్ ట్యాంకుకు నదిలో నుంచి పైప్‌లైన్ వేసే పనులు, రూ.10 లక్షలతో నిర్మించనున్న సంప్ పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. బుద్ధవనంలో మొత్తం రూ.40 కోట్ల అభివృద్ధి పనులు చేపడతామని పర్యాటక శాఖ ఉన్నతాధికారులు గత ఏడాది నిర్ణయించినా నేటి వరకూ అందులో సగం పనులు కూడా పూర్తికాలేదు. అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తున్న బుద్ధవనానికి దేశ, విదేశాల నుంచి పర్యాటకులు, బౌద్ధ మతస్తులు, బౌద్ధ భిక్షువులు ప్రతి ఏటా పెద్దసంఖ్యలో వస్తున్నారు. అయినా పూర్తిగా బుద్ధవనాన్ని అభివృద్ధి చేయకపోవడంతో పర్యాటకులు తమకు సరిపడా వసతులు లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు.



అసంపూర్తిగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం



కొనసాగుతున్న తాగునీటి పైప్‌లైన్ పనులు

టెండర్లు పూర్తి కాగానే పనులు మొదలు

బుద్ధవనంలో అభివృద్ధి పనులు ఇప్పటికే కొన్ని పూర్తికాగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. టెండర్లు ఖరారు కానీ పనులకు ప్రభుత్వం టెండర్లు పిలిచి పూర్తి చేయగానే పనులు మొదలుపెడతాం. పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూసుకుంటాం.

శ్రీనివాస్‌రెడ్డి, డీఈ, పర్యాటక శాఖ

క్రీడా తరగతులు మంచివే

చదువుతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు, ఒత్తిడిని అధిగమించేందుకు వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ విద్యార్థులకు వారానికి రెండు స్పోర్ట్స్ తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల సర్వత్రాహర్షం వ్యక్తమవుతోంది. అయితే ఇదే క్రమంలో ప్రత్యేక స్పోర్ట్స్ క్యాలెండర్‌ను రూపొందించి అమలయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ కూడా పెరుగుతోంది. అదేవిధంగా స్పోర్ట్స్ పిరియడ్ పెంపు ఒక ప్రభుత్వ కాలేజీలకే పరిమితం కాకుండా అన్ని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాల్లో కూడా ఖచ్చితంగా అమలయ్యేలా చూడాలన్న వాదన వినిపిస్తోంది.

● ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్,

స్వాగతిస్తున్నాం



విద్యార్థుల్లో ఒత్తిడి దూరం చేసేందుకు వారానికి రెండు స్పోర్ట్స్ తరగతులు అమలు చేసేందుకు ఇంటర్‌బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఇది కాగితాలకే పరిమితం కాకుండా పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా స్పోర్ట్స్ తరగతుల నిర్వహణకు సంబంధించి వ్యాయామ అధ్యాపకులు ఉండేలా అన్ని కళాశాలలకు నోటీసులు ఇచ్చి వారిని నియమించుకునేలా చర్యలు తీసుకోవాలి.

● ఐతగోని జనార్థన్‌గౌడ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

మంచి నిర్ణయమే



ఇంటర్.. విద్యార్థుల ఉన్నత చదువులకు టర్నింగ్ పాయింట్. ఇలాంటి సమయంలో విద్యార్థుల ఒత్తిడిని అధిగమించేందుకు కళాశాలల్లో వారానికి రెండు స్పోర్ట్స్ తరగతులు నిర్వహించడం మంచిదే. విద్యార్థులకు మానసిక, శారీరక ధృడత్వం కోసం ఒక్కో విద్యార్థికి 2600 క్యాలరీల పౌష్టికాహారాన్ని అందాచాలి. అప్పుడే విద్యార్థులు క్రీడలతో పాటు చదువులు రాణించగలుగుతారు. చెడు వ్యసనాలకు గురి కాకుండా ప్రత్యేక తరగతులను కూడా నిర్వహించాలి.

ఇందూరు సాగర్, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు

విద్యార్థులకు శుభపరిణామం



వారంలో రెండు స్పోర్ట్స్ క్లాసులు నిర్వహించడం శుభపరిణామం. ఇప్పటికే కొన్ని కార్పొరేట్ కళాశాలలు ర్యాంకుల విద్యార్థులను మానసికంగా ఒత్తిడి చేస్తుండడంతో అనేక మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. క్రీడల తరగతులు, స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాలను నిర్వహించడం మంచిదే.

● ఖమ్మంపాటి శంకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

హర్షించదగిన విషయం



వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ విద్యార్థులకు వారంలో రెండు స్పోర్ట్స్ తరగతులు నిర్వహించనుండడం హర్షణీయం. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రభుత్వ కళాశాలల్లో పీడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొదట ఖాళీగా ఉన్న పీడీ పోస్టులను భర్తీ చేసిన తర్వాత స్పోర్ట్స్ క్లాసులు ప్రారంభించాలి. ఇలాంటి నిర్ణయం రాష్ట్ర విద్యా విధానంలో ఒక మార్పునకు నాంది పలుకుతుంది.

● జినుకుంట్ల జయేందర్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్.

ఎన్ని మిల్లులు తిరిగినా..

● ధాన్యం లోడు ట్రాక్టర్లతో మిల్లుమిల్లు తిరుగుతున్న రైతులు ● తోచిన ధరకు కొనుగోలు చేస్తున్న మిల్లర్లు ● మద్దతు ధరపై అధికారుల మౌనం

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం విక్రయించేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. కొన్నిరకాల ధాన్యాన్ని కొన్ని మిల్లులే కొనుగోలు చేస్తుండడంతో తమ ధాన్యం ఏ మిల్లుల్లో విక్రయించాలో తెలియక ట్రాక్టర్ల లోడుతో తిరుగుతున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకే మిల్లుల వద్దకు చేరినప్పటికీ రాత్రి 7గంటల వరకు కొనుగోళ్లు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిల్లుల వద్ద వందల సంఖ్యలో ధాన్యం లోడు ట్రాక్టర్లు బారులు తీరుతున్నాయి. మిల్లర్లు తమకు తోచిన ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. కనీస మద్దతు ధరకు మిల్లర్లు మంగళం పాడినప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడని రైతులు ఆరోపిస్తున్నారు. మిల్లు గుమస్తా ఎప్పుడు వస్తాడో... షీకు కొట్టి ధానానికి రేటు కట్టి దిగుమతి చేసుకుంటాడోనని ఎండల్లో చెమటలు కక్కుతూ మిల్లుల ఎదుట పడిగాపులు కాస్తున్నామని అన్నదాతలు ఆక్రోశిస్తున్నారు.



యాద్గార్‌పల్లి రోడ్డులో రైస్‌మిల్లు ముందు బారులు తీరిన ధాన్యం లోడు ట్రాక్టర్లు

క్వింటా ధాన్యానికి రూ.300 తగ్గింపు

రెండు రోజుల క్రితం వరకు క్వింటాకు రూ.2300-2350 వరకు కొనుగోలు చేసిన మిల్లర్లు అకస్మాత్తుగా క్వింటాకు రూ.300 తగ్గించి సన్నధాన్యం కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. కొన్ని రకాల ధానాన్ని మిల్లర్లు రూ. 2000-2100లకే కొనుగోలు చేస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. సాధారణ చింట్లు రకాలను సైతం రూ.2220-2230 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, కనీస మద్దతు ధర కూడా రైతులకు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహీంద్ర చింట్లు రకాన్ని రూ.2100-2150వరకు కొనుగోలు చేయగా హెచ్ఎంటీ ధాన్యాన్ని క్వింటాకు రూ.2000కే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. గత సీజన్‌లో చింట్లు రకాల కంటే హెచ్ఎంటీ రకాన్ని రూ.50 తక్కువకు మాత్రమే కొనుగోలు చేయగా ఈ సారి రూ.300ల వరకు తగ్గించి కొంటున్నారని ఆరోపిస్తున్నారు.

మద్దతు ధర అధికారుల మౌనం

రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించడంలో అధికారులు విఫలమౌతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే మిల్లర్లు తక్కువకు కొనుగోలు చేస్తున్నప్పటికీ అధికారులు ప్రేక్షకపాత్రకే పరిమితమౌతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ.2320 మద్దతు ధర ప్రకటించినప్పటికీ రూ.2000-2200ల వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. రూ.2300 కంటే తక్కువకు ధాన్యాన్ని కొనుగోలు చేయకూడదని మిల్లర్ల సమావేశంలో హెచ్చరించినప్పటికీ సిండికేట్‌గా మారిన మిల్లర్లు అధికారుల ఆదేశాలు లెక్కచేయడం లేదని అంటున్నారు. షీకు కొట్టిన ధానాన్ని మిల్లరు కొంత పిడికిటిలో పట్టి క్షనంలో నాణ్యతను, ధరను ప్రకటిస్తున్నారని, వారు చెప్పిన ధరకే రైతులు విధిలేని పరిస్థితుల్లో అమ్ముకోవాల్సి వస్తోందని కన్నీటి పర్యంతరం అవుతున్నారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్క లోడే విక్రయించా



తెల్లవారు జామున 4 గంటలకే మూడు హెచ్ఎంటీ ధాన్యం ట్రాక్టర్ లోడ్‌లతో మిల్లుల వద్దకు వచ్చాను. సాయంత్రం 6 గంటల వరకు ఒక్కలోడ్ అమ్మా. క్వింటాకు 2000 చొప్పున కొనుగోలు చేశారు. ఇంకా రెండు లోడ్‌లను రోడ్డుపై నిలబెట్టి మిల్లుల చుట్టూ తిరుగుతున్నా. అవంతీపురం రోడ్‌లో హెచ్ఎంటీ రకం కొంటున్నారంటే మిల్లు వద్ద ఎదురుచూస్తున్నా.

● జాల నవీన్ రైతు, చీదేళ్ల, పెన్‌పహాడ్ మండలం

రూ.2,230లకే కొనుగోలు చేశారు



నాలుగు ట్రాక్టర్లు చింట్లు ధాన్యాన్ని మిల్లుకు అమ్మడానికి తెచ్చాను. తాలు, పచ్చగింజ వుందన్న నెపంతో క్వింటాకు రూ.2230కే కొనుగోలు చేశారు. రెండు రోజుల క్రితం రూ.2350 వరకు కొనుగోలు చేయగా ఈ రోజు క్వింటాకు వంద తగ్గించారు. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు.

● రావుల జాను, తిమ్మాపురం, దామరచర్ల మండలం

మద్దతు ధర ఇవ్వడంలేదు



వేములపల్లిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

వేములపల్లి: మిల్లర్లు మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం వద్ద రైతులు నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. శెట్టిపాలెం శివారులోని మిల్లులకు సూర్యాపేట జిల్లాలోని నేరేడుచర్ల, హుజూర్‌నగర్ ప్రాంతాలతో పాటు నల్లగొండ జిల్లాలోని దామరచర్ల, అడవిదేవులపల్లి, తిప్పర్తి నకిరేకల్ మండలాలతోపాటు ఆయకట్టు నుంచి భారీగా ధాన్యం తరలివస్తోంది. మంగళవారం ఒక్కొక్క మిల్లు వద్దకు మధ్యాహ్నం సమయానికి హెచ్ఎంటీ రకం ధాన్యం సుమారు 50 నుంచి వంద ట్రాక్టర్ల వరకు రావడంతో మిల్లర్లు తమ గరిషెలు నిండాయని కొనుగోలు చేయలేమంటూ ధాన్యం కొనేందుకు సుమారు రెండు గంటల పాటు విరామం ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళనతో సుమారు పావు గంట పాటు రాస్తారోకోకు దిగారు. ఈ క్రమంలో రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న వేములపల్లి ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకుని ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేసేలా మిల్లర్లతో మాట్లాడతానని చెప్పడంతో రైతులు రాస్తారోకో విరమించారు. ఈ సందర్భంగా పలువు రైతులు మాట్లాడుతూ మిల్లుల వద్దకు సన్నరకం ధాన్యమైన హెచ్ఎంటీ, చింట్లూ రకాలు భారీగా తరలివస్తున్నాయని, ప్రారంభంలో సన్నరకం ధాన్యాన్ని క్వింటాకు రూ.2,500 నుంచి రూ.2700 వరకు కొనుగోలు చేశారన్నారు. ప్రస్తుతం ఒక్కసారిగా ధర తగ్గించి చింట్లూ రూ.2,200 నుంచి రూ.2,300కు కొనుగోలు చేస్తున్నారని చెబుతున్నారు.

ఎప్పుడూ లేని నిబంధన ఇప్పుడెందుకు?

తిప్పర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): 'ఎప్పుడూ లేని నిబంధనలు ఇప్పుడెందుకు?.. తాలు పేరుతో ఐదు రోజులుగా ధాన్యం కాంటాలు ఆపుతారా?.. అంటూ రైతులు మార్కెట్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తిప్పర్తి సబ్‌మార్కెట్ యార్డులో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యంలో ఎక్కువ తాలు ఉం దంటూ లోడ్ లారీలను మిల్లు నిర్వాహకులు దిగుమతి చేసుకునేందుకు నిరాకరించారు. ఐదు రోజులుగా లారీలు దిగుమతి కాకపోవటంతో ధాన్యం కాంటాలు వేయడం కుదరదని తిప్పర్తి సబ్‌మార్కెట్ నిర్వాహకులు కొనుగోళ్లు నిలిపివేశారు. ఐదు రోజులుగా 30వేల క్వింటాళ్ల ధాన్యం కాంటాలు వేయకపోవడంతో ఆగ్రహించిన సుమారు 100మంది రైతులు తిప్పర్తిలోని అద్దంకి-నార్కట్‌పల్లి జాతీయ రహదారిపై మంగళ వారం 15నిమిషాల పాటు ధర్నా చేశారు. ఎప్పుడూ లేని నిబంధన ఇప్పుడెందుకని రైతులు ప్రశ్నించారు. ఒకరి ద్దరు రైతుల ధాన్యంలో తాలు ఉందనే సాకుతో ఐదు రోజులుగా రైతులందరి ధాన్యాన్ని కాంటా వేయకుండా నిలిపివేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. మార్కెట్ నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కైయ్యారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న డీఎస్‌వో హరీష్, తహసీల్దార్ పరుశురామ్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి రైతుల వద్దకు వచ్చి మాట్లాడేందుకు ప్రయత్నించారు.



తిప్పర్తిలో నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

దీంతో రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎస్ఐ సాయి ప్రశాంత్ రైతులతో మాట్లాడి జిల్లా స్థాయి అధికారులకు సమాచారం ఇచ్చారు. ధాన్యం కాంటా వేయిస్తామని అధికారులు ఫోన్‌లో హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. మంగళవారం సాయంత్రం వరకు అధికారుల నుంచి ఎటువంటి సమాచారం రాకపోవటంతో ధాన్యం కొనుగోళ్ల కోసం రైతులు మార్కెట్‌లోనే పడిగాపులు కాస్తున్నారు.

ఓ కంపెనీకి చెందిన సీడ్‌తోనే..

ఓ కంపెనీకి చెందిన ధాన్యం సీడ్ వల్లనే ఈ సమస్య వచ్చిందని రైతులు చెబుతున్నారు. ఈ వేసవి కాలం సీజన్‌లో ఓ కంపెనీకి చెందిన సీడ్ సుమారు మండలవ్యాప్తంగా వెయ్యి ఎకరాలకు పైగా వాడినప్పటికీ రైతులందరికీ అలాంటి సమస్య రాలేదని అందులో 40 నుంచి 50ఎకరాల్లో సాగు చేసిన కొద్దిమంది రైతులకు తాలు సమస్య వచ్చిందన్నారు.

తక్షణమే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలి

కోదాడ రూరల్: ధాన్యం కొనుగోళ్లు తక్షణమే ప్రారంభించాలని సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తమ్మర గ్రామ రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం కోదాడ పట్టణంలోని ఖమ్మం-కోదాడ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. తమ్మర గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఆర్భాటంగా రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారని, నేటి వరకు కొనుగోళ్లు ప్రారంభించలేదని రైతులు అన్నారు. సాగర్ ఎడమకాల్వ కింద వరికోతలు 20రోజుల క్రితమే ప్రారంభమైనా నేటికీ కొనుగోళ్లను ప్రారంభించలేదన్నారు. మొదట్లో క్వింటా ధాన్యాన్ని రూ.2,300కు కొనుగోలు చేసిన మిల్లర్లు ప్రస్తుతం రూ.1,800కే అడుగుతూ నిలువునా దోపీడీ చేస్తున్నారన్నారు. మద్దతు ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా నేటికీ నెరవేర్చలేదన్నారు. రైతుల రాస్తారోకోతో కోదాడ-ఖమ్మం జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాలు ఆగిపోయాయి.



కోదాడ: ఖమ్మం-కోదాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ వాజిద్‌అలీ, ఎస్ఐ నవీన్‌కుమార్‌లు చేరుకుని రైతులతో మాట్లాడి బుధవారం నుంచి ధాన్యం కొనుగోలు చేస్తారని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

పేదల కడుపునింపేందుకే సన్న బియ్యం

● శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



సన్న బియ్యంతో వండిన భోజనం చేస్తున్న మండలి చైర్మన్ గుత్తా

చిట్యాలరూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పేద, సామాన్య ప్రజల కడుపు నింపేందుకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో దళిత కుటుంబానికి చెందిన లబ్ధిదారుడి ఇంట్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిలతో కలిసి మంగళవారం భోజనం చేశారు. గతంలో రేషన్ దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ చేస్తుండగా వాటిని చాలామంది లబ్ధిదారులు తినేందుకు విముఖత చూపుతూ ఇతరులకు విక్రయించేవారని, తినేందుకు సన్నబియ్యం మార్కెట్‌లో కొనుక్కుని తిరేవారన్నారు. ప్రభుత్వంపై భారం పడుతున్నా పేద సామాన్య ప్రజలు కడుపునిండా తినేందుకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు. మార్కెట్‌లో సన్నబియ్యం ధర రూ.55లకు కిలో ఉండగా పేదలందరూ కడుపునిండా తినాలని ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు. రాష్ట్రంలోని ప్రజలు సన్నబియ్యం తీసుకుని సంతోషంగా ఉన్నారని ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డిని అభినందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నార్మాక్ మాజీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సుంకరి మల్లేష్‌గౌడ్, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో జయలక్ష్మీ, సీఐ కె. నాగరాజు, ఎస్ఐ ధర్మ, ఆర్ఐ జానీషరీఫ్, పంచాయతీ కార్యదర్శి ఉపేందర్, కాటం వెంకటేశం, గుడిపాటి లక్ష్మీనర్సింహ, గుత్తా వెంకట్‌రాంరెడ్డి, కోనేటి యాదగిరి, పల్లపు బుద్దుడు, వనమా వెంకటేశ్వర్లు, జడల చినమల్లయ్య, చెరుకు సైదులు, సుంకరి వెంకన్న, జన్నపాల శ్రీను పాల్గొన్నారు.

దేశవ్యాప్త కులగణన కోసం ఉద్యమించాలి

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరగబోయే జనగణనతోపాటు కులగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఐక్యంగా ఉద్యమించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయ్య అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని బీసీ జేఏసీ కార్యాలయంలో మంగళవారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన జరపడంతోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ పెరుగుతాయన్నారు. పదేళ్లుగా చేపట్టిన ఉద్యమాల ఫలితంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లుకు అసెంబ్లీలో ప్రవేశపెట్టారని, దేశవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లు దక్కించుకునేందుకు బీసీలంతా ఏకమై ఉద్యమించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు, కోల సైదులు, ఎండీ సయీద్, మురళియాదవ్, చిరంజీవి, జయరాజు, లింగానాయక్, శ్రీను, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జాతరలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయి

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జాతరలు, ఉత్సవాలు సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని హైదరాబాద్ ఇంటలిజెన్స్ డీఎస్పీ చవ్వా శంకర్‌రెడ్డి అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా నల్లగొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) లో రాష్ట్రస్థాయి మహిళా కోలాటాలు, ఎడ్ల పందేల విజేతలకు బహుమతులు అందజేశారు.

కోలాట పోటీల విజేతలు

మహిళా కోలాట పోటీల్లో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సమీపంలోని గూడూరుకు చెందిన శ్రీఆంజనేయస్వామి కోలాట బృందం(ప్రథమ), సూర్యాపేట జిల్లా పాండ్య నాయక్‌తండాకు చెందిన చందులాల్‌కోలాట బృందం(ద్వితీయ), అచ్చంపేట అమ్రాబాద్‌కు చెందిన అమరేశ్వర కోలాట బృందం(తృతీయ), సూర్యాపేట జిల్లా గరిడేపల్లికి చెందిన హరేశ్రీనివాస కోలాట బృందం(నాలుగో), మేళ్లచెర్వుకు చెందిన మేరమ్మతల్లి కోలాట బృందం(ఐదో స్థానం), సంగూనితండాకు చెందిన బంగారు మైసమ్మతల్లి కోలాట బృందం(6వ స్థానం), బుడియబాపు కోలాట బృందం(7వ స్థానం) సాధించాయి.

ఎడ్ల పందేల విజేతలు

రాష్ట్రస్థాయి ఎద్దుల పందేల పోటీల్లో ప్రకాశం జిల్లా వేటపాలేనికి చెందిన అత్తోట శిరీషచౌదరి, శివకృష్ణచౌదరి ఎద్దుల జత(మొదటి స్థానం), గుంటూరు జిల్లాకు చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ఎద్దుల జతలు(రెండవ స్థానం), ప్రకాశం జిల్లా బాపట్ల మండలం చిననందిపాడుకు చెందిన పమిడి సుష్మాంత్‌బాబు ఎద్దుల జతలు (మూడో



బహుమతులు అందచేస్తున్న హైదరాబాద్ ఇంటెలిజెన్స్ డీఎస్పీ చవ్వా శంకర్‌రెడ్డి

స్థానం), గుంటూరు జిల్లా లింగాయపాలేనికి చెందిన ఎల్లం సాంబశివరావు ఎద్దుల జతలు(నాలుగో స్థానం) నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం సూరేపల్లికి చెందిన సంకూరి అనంతరాములు ఎద్దుల జతలు(5వ బహుమతి), పల్నాడు జిల్లా అమరావతి మండలం గిడుగు గ్రామానికి చెందిన బండి సాహితి శ్రీభవన్ ఎద్దుల జతలు(6వ బహుమతి), నల్లగొండ జిల్లా గాత్‌తండాకు చెందిన మెగావత్ మంగ్యానాయక్ ఎద్దుల జతలు(7వ బహుమతి), గెలుపొందాయి. ఈ కార్యక్రమంలో శ్రవణ్‌కుమార్‌రెడ్డి, చవ్వా బుచ్చిరెడ్డి, షేక్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణ పరీక్షలో బంగారు పతకం



కోదాడటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన కనమర్లపూడి స్వప్న భగవద్గీత పారాయణ పరీక్షలో బంగారు పతకం సాధించింది. ప్రతి ఏటా మైసూరులోని శ్రీగణపతి సచ్చిదానంద అవధూత దత్త పీఠం ఆధ్వర్యంలో నిర్వహించే భగవద్గీత పారాయణ పరీక్షలో మొదటి ప్రయత్నంలోనే 18అధ్యాయాలు 700 శ్లోకాలను నిర్విరామంగా పారాయణం చేసి ప్రథమ స్థానంలో నిలిచింది.

యాదగిరీశుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 8(ఆంధ్యజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్పమాలికలు, పట్టువస్త్రాలు, బంగారు, వైజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామా పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. పంచనారసింహుడి సన్నిధిలో కొలువు దీరిన క్షేత్రపాలకుడు అంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొల్పి నిజా భిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమశాస్త్ర రీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్థిని రామలింగేశ్వర స్వామికి ముఖ మండపంలోని స్పటికమూర్తులకు నిత్య పూజలు, నిత్యరుద్రహవనం



ఆలయ ముఖమండపంలో పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.13,17,083 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	516
టీఎంసీలు	142.0820
ఎడమకాల్వకు నీటి విడుదల	4,881
కుడికాల్వకు	2,053
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	8,734

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.93 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	800 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్నిగేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	624.40 అడుగులు
టీఎంసీలు	0.76
కాల్వలకు విడుదల	28.17 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	760.99 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	56.99క్యూసెక్కులు

ఇకపై రిజిస్ట్రేషన్లకూ స్లాట్ బుకింగ్

(5వ పేజీ తరువాయి)

కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 10వ తేదీనుంచి భువనగిరి, చౌ టుప్పల్ కార్యాలయాల్లో నూతన విధానం అమల్లోకి రానుంది. ఆ రోజు నుంచి సేవలు త్వరగా అందుతాయి. తెలంగాణలో 19 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయగా యాదాద్రి భువనగిరి జిల్లాలో రెండు కార్యాలయాలను ఎంపికచేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సేవలను త్వరలో విస్తరిస్తారు. స్లాట్ బుకింగ్ విధానం దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పునర్ వ్యవస్థీకరణ చేయనున్నారు. ఈ విధానంవల్ల ఇకపై నిషేధిత జాబితాలోని ఆస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయకుండా పకడ్బందీ చర్యలు ఉంటాయి. భూభారతి తరహాలో ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను తెచ్చి నిషేధిత ఆస్తుల వివరాలను అందులో పొందుపరుస్తారు. నిషేధిత జాబితా స్థలాలను రిజిస్ట్రేషన్ చేసినట్లయితే కఠినమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఎక్కడైనా నిషేధిత జాబితాలోని భూమిని రిజిస్ట్రేషన్ చేస్తే క్షణాల్లోనే స్టాంపులు, రిజిస్ట్రేషన్ ప్రధాన కార్యాలయంలో ఆన్‌లైన్ తెలిసిపోయేలా చర్యలు తీసుకుంటున్నారు.

నూతన బుకింగ్ విధానంతో..

నూతన స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్లు సులభతరమవుతాయి. ఉదయం 10.30 గంటల నుంచి 1.30గంటల వరకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. ఆస్తుల క్రయవిక్రయదారులు స్లాట్ బుకింగ్ తర్వాత లాగిన్‌లో, డిపార్ట్‌మెంట్ పోర్టల్‌లో పూర్తి వివరాలు అందుబాటులోకి వస్తాయి. స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్లను స్కాన్‌చేసి అదేరోజున సంబంధిత ఆస్తుల కొనుగోలుదారులకు ఇస్తారు. ఒకవేళ ఏదైనా కారణంతో పెండింగ్‌లో పడితే, దానికి కారణాలను అధికారులు వివరిస్తారు. పారదర్శకంగా, వేగవంతంగా స్లాట్ బుకింగ్ ఉపయోగించుకునేలా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. పైలెట్ ప్రాజెక్టు ప్రాతిపదికన చేపడుతున్న ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో ఉమ్మడి జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు విస్తరించేలా యంత్రాంగం ప్రణాళికలు రూపొందించింది.



శాకంబరిదేవిగా రేణుకాఎల్లమ్మ

కనగల్, ఏప్రిల్ 8:(ఆంధ్రజ్యోతి): దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మతల్లి మంగళవారం భక్తులకు శాకంబరిదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకుడు నాగోజు మల్లాచారి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

శాలిగౌరారం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చామల జైపాల్ రెడ్డి కోరారు. స్థానిక గ్రామపంచాయతీ వద్ద మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ప్రతి గింజా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

» నకిరేకల్, తుంగతుర్తి ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేల్ » పలు మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నకిరేకల్, ఏప్రిల్ 8, (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి గింజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని మంగళపల్లి, నోముల, వల్లభాపురం గ్రామాల్లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులకు ధాన్యం అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మాత్రమే అమ్ముకుని మద్దతు ధర పొందాలన్నారు. మిల్లర్లు రైతులను ఇబ్బందులు పెట్టకుండా ఎప్పటికప్పుడు సకాలంలో ధాన్యాన్ని తీసుకోవాలన్నారు. కనీస మద్దతు ధర విషయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడితే సహించేది లేదన్నారు. టార్పాలిన్లు, గోతాశ్లు రైతులకు అందుబాటులో ఉంచాలని, రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బచ్చుపల్లి గంగాధర్‌రావు, మండలాధ్యక్షుడు నకిరేకంటి యేసుపాదం, గాదగోని కొండయ్య, నకిరేకంటి నరేందర్ పాల్గొన్నారు.



నకిరేకల్ మండలం వల్లభాపురంలో కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం



శాలిగౌరారం మండలం గురజాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సామేల్

ప్రభుత్వ కేంద్రాల్లోనే మద్దతు ధర

శాలిగౌరారం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని గురజాల, తుడిమిడి, చిత్తలూరు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతు పండించిన ప్రతి గింజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీవో గార్లపాటి జ్యోతి, ఏపీఎం ధర్నెబోయిన రాములు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కందాల సమరం రెడ్డి, నాయకులు అన్నెబోయిన సుధాకర్, గూని వెంకటయ్య, ననుబోతు అంజయ్య, ఎర్ర సుధాకర్, కోక సాయి కుమార్, యల్మకంటి యాదయ్య, కోక ముత్తయ్య, కోక రవి, పాల్గొన్నారు.



మునుగోడు మండలం కచలాపురంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

మునుగోడు రూరల్ : రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధరను పొందాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మండలంలోని కొరటికల్, గూడపూర్, పులిపలుపుల, ఊకొండి, కచలాపురం గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్య కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు.కార్యక్రమంలో చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గురుజ రామచంద్రం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భీమనపల్లి సైదులు, మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి యాదవ్ పాల్గొన్నారు.

● తిప్పర్తి : మండలంలోని సర్వారం గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తిప్పర్తి మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి ప్రారంభించారు. రైతులు తమ ధాన్యాన్ని శుభ్రం చేసుకొని మ్యాచర్ వచ్చే విధంగా ఆరబెట్టుకొని సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ పి.ప్రవీణ్ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, నాగులవంచ లింగారావు, చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, ముత్తినేని శ్యాంసుందర్, జాకటి మోష, కిన్నెర అంజి, బద్దం సుధీర్, గుండు శ్రీను, ప్రశాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలోఅంతరాయం

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) :నల్లగొండ పట్టణంలోని బీట్ మార్కెట్ వద్ద గల 11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా బుధవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఏడీఈ వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచముఖి హనుమాన్ ఆలయం, రామగిరి, గాంధీనగర్, బీట్ మార్కెట్, సీతారామచంద్రస్వామి ఆలయం, క్లాక్‌టవర్, సావర్కర్‌నగర్, ఎన్‌జీ కాలనీ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యానికి అభినందన

మునుగోడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం సచివాలయంలో మర్యా ద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సన్మానించి అభినందనలు తెలిపారు. ఆయన వెంట సీపీఐ జాతీయ సమితి సభ్యుడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి ఉన్నారు.



ఎమ్మెల్సీ సత్యంను అభినందిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఘనంగా హనుమత్ గాయత్రి మహాయజ్ఞం



ఆంజనేయ స్వామికి అభిషేకం చేస్తున్న గురుస్వామి, పాల్గొన్న భక్తులు

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 8,(ఆంధ్రజ్యోతి) : నల్లగొండ పట్టణంలోని తులసీ నగర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం పుట్ట కోటయ్య గురుస్వామి ఆధ్వర్యంలో హనుమత్ గాయత్రి మహాయజ్ఞం, లక్ష పుష్పార్చన మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన, ఆంజనేయ స్వామికి పంచామృతాభిషేకం చేశారు. మహాయజ్ఞంలో మాలధారులు, భక్తులకు అన్నవితరణ చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు శివ ప్రసాద్ శర్మ, హరీష్‌శర్మ, ఆంజనేయ స్వామి మాలధారులు వాస నగేష్, ఐతరాజు యాదగిరి, సింగరాపు విజయ్, నాగరాజు, శివ, ధోని, పుట్ట చంద్ర శేఖర్, పోతెపాక నవీన్, పగిల్ల రఘు, నిమ్మల నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను అభినందిస్తున్న మేడి హరికృష్ణ, ఉపాధ్యాయులు

చిట్యాలరూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలం వట్టిమర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల విడుదలైన గురుకుల ప్రవేశ అర్హత పరీక్షలో అర్హత సాధించారు. ఆసరా స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ మంగళవారం పాఠశాలలో విద్యార్థులను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వట్టిమర్తి ప్రాథమిక పాఠశాలలో 15 మంది విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్ష రాయగా 11మంది అర్హతను సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జానకి, ఉపాధ్యాయులు సస్వతి, మౌనిక, సరిత, భారతి, విమల, విద్యార్థులు పాల్గొన్నారు.

జీపీల్లో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్మికులు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయితీల్లో మల్టీపర్పస్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసి కార్మికుల వేతనాలకు ప్రత్యేక గ్రాంటును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి బయ్యన్న డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయితీ కార్మికులు సమస్యల పరిష్కారానికి స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా బయ్య న్న మాట్లాడుతూ నెలనెలా వేతనాలు అందక పంచాయతీ కార్మికులు అర్థాకలితో పని చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే అరకొర వేతనాలు సైతం నెలల తరబడి అందని పరిస్థితి నెలకొందన్నారు. పంచాయతీ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని ఆయన విమర్శించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో జీపీ కార్మికులు సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, జీపీ కార్మిక సంఘం నాయకులు శ్రీను, మంద ఎల్లయ్య, ఎం.శంకరయ్య, జి.వెంకటేష్, యాదయ్య, ఎల్లమ్మ, ఎల్.నర్సమ్మ, పి.యాదయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి

చిట్యాలరూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దివ్యాంగులకు రూ. 6వేలు పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చిందని దానిని అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు గోలి ప్రభాకర్ డిమాండ్ చేశారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని గుండ్రాంపల్లిలో దివ్యాంగులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నరయినా కూడా నేటి వరకు దివ్యాంగుల పింఛన్ రూ. 6వేల పెంచకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో గరిషె శేఖర్, నారాయణ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

చండూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందించాలని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర నాయకుడు పిన్నింటి నరేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు నకిరేకంటి లింగస్వామి గౌడ్ డిమాండ్ చేశారు . మండలంలోని పుల్లెంల గ్రామంలో మంగళవారం గ్రామంలో సంక్షేమ పథకాలు అందని వారి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత ప్రజలకు పంపిణీ చేసే సన్న బియ్యం పథకంలో కిలో బియ్యానికి రూ. 40 కేంద్ర ప్రభుత్వం, రూ.10 రాష్ట్ర ప్రభుత్వం కలిపి ఇస్తుందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, లేని యెడల వారి తరఫున బీజేపీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులడు గిరి శివకుమార్, మండల ఉపాధ్యక్షుడు జెట్టి యాదయ్య, నాయకులు నలపరాజు యాదగిరి, శిలువేరు వెం కన్న, ఉప్పునూతల సాయి తదితరులున్నారు.



చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో దివ్యాంగుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు గోలి ప్రభాకర్



మర్రిగూడ సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

● మర్రిగూడ : బీజేపీ జాతీయ కమిటీ పిలుపు మేరకు ప్రతి గ్రామంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం, జెండా పండుగ నిర్వహించి , 10, 11,12 తేదీలో గావ్ చలో అభియాన్ - బస్తీ చలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని బీజేపీ మండలాధ్యక్షుడు రాజేందర్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం వేణుకుమార్ తెలిపారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా అధికార యాస అమరేందర్ రెడ్డి, జిల్లా నాయకులు గ్యార గోపాల్, వెనేపల్లి శ్రీనివాసరావు, గ్యార యాదగిరి, మండల నాయకులు కేసరి రవీందర్ రెడ్డి, పగిళ్ల లింగస్వామి, ముత్యంరెడ్డి, సిలివేరు వెంకటేష్, గ్యార రామలింగం, జిల్లా కిషోర్, పంగ యాదయ్య, కుమార స్వామి, శోభన్ బాబు, నరసింహాచారి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం.. పేదోడి ఆత్మగౌరవ పథకం : ఎమ్మెల్యే

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం పేదోడి ఆత్మ గౌరవాన్ని పెంచే పథకమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని చెర్వుగట్టు రేషన్ దుకాణంలో మంగళవారం సన్నబియ్యం పథకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు నేతగాని కృష్ణ, వడ్డె భూపాల్‌రెడ్డి, వి.రమేష్, ఆర్.రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

● మునుగోడు రూరల్ : మండలంలోని ఇప్పర్తి గ్రామ రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా కార్యదర్శి బూడిద లింగయ్య యాదవ్ ప్రారంభించారు.కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు బొజ్జ మల్లయ్య, చీమల రాజుయాదవ్, ఆవుల శ్రీను యాదవ్, చీమల లింగయ్య, దేవర యాదయ్య, లింగయ్య పాల్గొన్నారు.



ఇప్పర్తిలో బియ్యం పంపిణీ ప్రారంభం

అన్ని గ్రామాల్లో పోషణ అభియాన్ నిర్వహించాలి

చండూరు రూరల్, చిట్యాల రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : పోషణ అభియాన్‌పై మహిళలకు అవగాహన కల్పించాలని సీడీపీవో లావణ్య కుమారి అన్నారు. చండూరు, చిట్యాల ఎంపీడీవో కార్యాలయాల్లో పోషణ పక్షం-2025 పై నిర్వహించిన సమీక్షా సమావేశాల్లో ఆమె మా ట్లాడారు. మంగళవారం నుంచి ఈ నెల 22 వరకు గ్రామాల్లో అన్ని అంగన్‌వాడీ పోషణ పక్షం 2025 పోషణ్ అభియాన్ నిర్వహించాలని సూచించారు. చండూరులో ఎంపీడీవో బండారు యాదగిరి, ఏసీడీపీవో వెంకటమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ, ఏపీఎం పుల్లయ్య పాల్గొ న్నారు. చిట్యాల సమావేశంలో ఎంపీడీవో ఎస్‌పి. జయలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ వీరేందర్, ఏసీడీపీవో వెంకటమ్మ, హెల్త్‌సూపర్‌వైజర్ వెంకటరమణ, ఏపీఎం పద్మ, సూపరింటెండెంట్ మనోహర్, సునీత తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం : స్థానిక పీహెచ్‌సీలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. పౌష్టికాహార దాతలు చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్, కూతురు మంగలి చైత్ర జన్మదినం సందర్భంగా గర్భిణులు ఆరోగ్య కేంద్రం సిబ్బందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్వేత డాక్టర్ పాల్వాయి వెంకటేష్, ఎంఎస్‌హెచ్‌సీ శ్వేత, పీహెచ్‌ఎన్ రాములమ్మ, సూపర్‌వైజర్లు దయామణి, క్లబ్ అధ్యక్షుడు డెంకల సత్యనారాయణ, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

● కేతేపల్లి : పోషణ పక్షోత్సవాలను విజయవంతం చేయాలని కేతేపల్లి ఎంపీడీవో బి.శ్రీనివాసరావు కోరారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఐసీడీఎస్, వైద్య, ఆరోగ్య శాఖల సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం నుంచి 22వరకు అన్ని గ్రామాల్లో నిర్వహించి పోషణపై శ్రద్ధ చూపాల్సిన ఆవశ్యకత పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.సమావేశంలో మండల వైద్యాధికారి కె.అర్చన, డిప్యూటీ తహసీల్దార్ సత్తార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, ఎంపీవో నాగలక్ష్మి, ఏపీవో సురేందర్, అంగన్‌వాడి కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి : పోషణ అభియాన్‌పై స్థానిక ఐకేపీ సమావేశ మందిరంలో మంగళవారం సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భం గా నార్కట్‌పల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సరిత మాట్లాడుతూ ఎస్‌ఎస్‌ఎఫ్‌పి, కిశోరబాలికల రక్తహీనతపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంఈవో నరసింహ, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రకళ, ఏఎన్ఎం గీత, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

● మర్రిగూడ : మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో పోషణ పక్షం సమావేశం ఎంపీడీవో మున్నయ్య అధ్యక్షతన నిర్వహించారు. సూపర్‌వైజర్ యశోద పోషణ పక్షం షెడ్యూల్ వివరించారు. అభియాన్ కార్యక్రమాలు అన్ని గ్రామాల్లో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో డిపార్ట్‌మెంట్స్ అందరూ కలిసి లోప పోషణ నివారించడం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, యశోద, ఎంపీడీవో మున్నయ్య, డాక్టర్ శాలిని, ఏపీఎం వెంకట్రామ్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.



చండూరు ఎంపీడీవో కార్యాలయం సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో లావణ్య కుమారి



మర్రిగూడ ఐసీడీఎస్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ యశోద

నెరవేరనున్న కల

(5వ పేజీ తరువాయి)

చేశారు. ఈవిధంగా మండలంలో ఉన్న ప్రభుత్వ, అటవీ భూములను సేద్యం చేస్తున్న, ప్రధానంగా భూ సమస్యలు ఉన్న చింతలపాలెం, జమ్మనకోట, నెల్లికల్, తిమ్మాయిపాలెం, తునికినూతల రెవెన్యూ గ్రామాలను మొదటగా పకడ్బందీగా నిర్వహించారు. అదేవిధంగా సాగర్ ప్రాజెక్టులో పునరావాస గ్రామాలైన నాగార్జునపేటతండా, గోడుమడక, చెన్నాయిపాలెం, గట్టుమీది తండా, సుంకిశాల గ్రామాలను పర్యటించి వారి వద్ద, ప్రభుత్వం వద్ద లభ్యమైన డీ ఫారెస్ట్ పట్టాల ఆధారంగా సర్వే నిర్వహించి రైతులను గుర్తించారు. అదే విధంగా చింతలపాలెం, తిమ్మాయిపాలెం రెవెన్యూ గ్రామాల్లోని పది సర్వేల్లోగల సుమారు 2,800 ఎకరాల్లో ఉన్న కాందిశీకుల భూముల్లో కబ్జాలో ఉన్న రైతులను గుర్తించేలా సర్వే నిర్వహించారు. అనంతరం మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ బృందాలు పర్యటించి ప్రభుత్వ భూములను సేద్యం చేస్తున్న రైతులను గుర్తించేలా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి చర్యలు చేపట్టారు.

సుదీర్ఘంగా కొనసాగిన ప్రక్రియ

ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ పైలట్ ప్రాజెక్టును విజయవంతం చేసేందుకు కలెక్టర్లు నారాయణరెడ్డి, ఇలాత్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, గతంలో చండూరు ఆర్డీవోగా పనిచేసిన సుబ్రహ్మణ్యంతో పాటు జిల్లా సర్వే విభాగాధికారి శ్రీనివాస్‌తోపాటు పలువురు తహసీల్దార్లు, రెవెన్యూ సర్వేయర్లు సుమారు ఆరు నెలలపాటు శ్రమించారు. వీరికి సీసీఎల్‌ఏ నవీన్ మిట్టల్ మార్గదర్శకాలను నిరంతరం చేస్తుండడంతో రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన ఒక కొలిక్కి వచ్చింది. ఈక్రమంలోనే అర్హులైన రైతులను గుర్తించి గ్రామాలవారీగా జాబితాను నోటీస్ బోర్డుల్లో ప్రకటించారు. అనంతరం సదరు రైతుల ఆధార్‌కార్డులు, వారి వద్ద ఉన్న భూమి ధ్రువపత్రాలతో మీసేవా ద్వారా ఆన్‌లైన్ చేయించి ప్రక్రియను ఒక కొలిక్కి తీసుకొచ్చారు. ఈ క్రమంలో మంగళవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అసైన్‌మెంట్ కమిటీ సమావేశమై 13 గ్రామాలకు చెందిన 4,500 మంది రైతులకు చెందిన 4వేల ఎకరాలకు లావూని పట్టాలు జారీ చేసేలా నిర్ణయించడంతోపాటు త్వరలో ప్రక్రియను ముగించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఒక సభను ఏర్పాటుచేసి ఈ ప్రాంత పేద రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను సీఎం అందజేయనున్నట్లు సమాచారం.

ఎన్నో ప్రయోజనాలు కోల్పోయాం



మేము కాస్తులో ఉండి సేద్యం చేస్తున్నప్పటికీ వివా దాస్పద భూములుగా నమోదు కావడంతో ఎనిమిదేళ్లుగా ప్రభుత్వ భూములకు పాస్ పుస్తకాలు పొందలేక పోయాం. రెవెన్యూ పైలట్ ప్రాజెక్టు వల్ల మమ్మల్ని రైతులుగా గుర్తించి పాస్ పుస్తకాలు ఇవ్వబోతుండడం ఆనందంగా ఉంది.

-రమావత్ హనుము, తిమ్మాయిపాలెం

పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి



చింతలపాలెం, తిమ్మాయిపాలెం రెవెన్యూ శివారుల్లో వందలాది మంది రైతులు కాందిశీకుల భూముల్లో సేద్యం చేసుకుంటున్నారు. గతంలో మాకు ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా ప్రయోజనాలు అందాయి. కానీ ఎనిమిదేళ్లుగా ఆ భూములపై హక్కులను కోల్పోవడంతో రైతుభరోసా, రైతుబీమా, బ్యాంకుల నుంచి రుణాలు, సబ్సిడీలు పొందలేక పోతున్నాం. ప్రభుత్వం మాకు కూడా పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

-మెగావత్ నాగేందర్‌నాయక్, నాయకునితండా

పెంచిన గ్యాస్ ధర వెంటనే తగ్గించాలి

● చిట్యాల, ఏప్రిల్ 8, (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. చిట్యాలలో మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ కేంద్రం పెట్రో ధరలు పెంచుతుందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎండీ అక్బర్, పట్టణ కార్యదర్శి ఎస్‌కే షరీఫ్, బొల్గూరి లింగయ్య, వెంపటి శ్రీనివాస్, బాలరాజు, సత్తయ్య పాల్గొన్నారు.


● నకిరేకల్ : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐఎం ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్ డిమాండ్ చేశారు. పెంచిన ధరలను నిరసిస్తూ మంగళవారం నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమలో అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జ్వాల వెంకటేశ్వర్లు, అంబటి చిరంజీవి, పీవైఎల్ అధ్యక్ష, కార్యదర్శులు మామిడోజు వెంకటేశ్వర్లు, బీవీ చారి, సత్తిరెడ్డి, గజ్జి రవి పాల్గొన్నారు.



నకిరేకల్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేస్తున్న సీపీఐఎం నాయకులు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

5 | బుధవారం 9 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972


చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.5 । కనిష్ఠం 23.8

క్షేత్రస్థాయిలో రైతుల భూముల్లో సర్వే నిర్వహిస్తున్న అధికారులు



నెరవేరనున్న కల

» ఏళ్ల తరబడి నిరీక్షణకు తెర » అక్రమార్కులకు చెక్ పెట్టిన అధికారులు

» 4500 మంది రైతులకు లబ్ధి చేకూరేలా ఆమోద ముద్ర

ఎన్నో ఏళ్ల కష్టాలకు తెరపడనుంది. రెవెన్యూ రికార్డుల భూప్రక్షాళన చేసే క్రమంలో వివాదాస్పద భూములుగా పార్ట్-బీలో నమోదై, పాస్ పుస్తకాలు పొందలేక ఇబ్బందులకు గురవుతున్న కృష్ణపట్టెతో పాటు పలు గ్రామాల రైతుల కష్టాలు తీరనున్నాయి. త్వరలోనే వారికి ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వనుండడంతో రైతుల కల సాకారం కానుంది.

- (ఆంధ్రజ్యోతి-తిరుమలగిరి(సాగర్))

మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆధ్వర్యంలో మంగళవారం అసైన్‌మెంట్ కమిటీ సమావేశమైంది. మండలంలోని 13గ్రామాలకు సంబంధించి 4వేలఎకరాలకు 4500మంది రైతులకు లబ్ధిచేకూరేలా ఆమోద ముద్ర పడడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తుంది.

రెవెన్యూ పైలట్ ప్రాజెక్టుగా..

మండలంలో ప్రభుత్వ, అటవీ, కాందీశికుల, ఎండోమెంట్ భూములతోపాటు, ప్రభుత్వ, ఫారెస్ట్ భూముల సరిహద్దులు, నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ముంపునకు గురైన గ్రామాల పునరావాస భూవివాదాలున్నాయి. ఇలాంటి క్లిష్టమైన భూసమస్యలు ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం తిరుమలగిరి(సాగర్) మండలాన్ని రెవెన్యూ పైలట్ ప్రాజెక్టుగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. ఈ క్రమంలో మండలంలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలకు పరిష్కారం చూపించే దిశగా సీసీఎల్ఏ ఆధ్వర్యంలో కలెక్టర్ నేతృత్వంలో వివిధ మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులతో పలు బృందాలను ఏర్పాటు చేశారు. ఈక్రమంలో ఆరు బృందాలను ఏర్పాటు చేసి ఒక్కో బృందంలో తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్లు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, మీసేవా సిబ్బందిని నియమించి నిర్దేశించిన రెవెన్యూ గ్రామాల్లో కాస్తు కబ్జాలో ఉన్న ప్రతీ ఎకరాన్ని రైతుల సమక్షంలోనే అంక్షాంశ, రేఖాంశాల ఆధారంగా హద్దులను నిర్ధారించారు. అక్కడికక్కడే రైతుల ఫొటోలను క్షేత్రస్థాయిలో తీసుకొని డిజిటలైజేషన్...

- మిగతా 8వ పేజీలో...

సర్వేలో పైలట్ ప్రాజెక్టులో భాగంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్న క్రమంలో రెవెన్యూ అధికారులకు గతంనుంచి వివాదస్పదంగా నమోదైన భూముల విషయంలో చోటు చేసుకున్న అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో ఈ ప్రాంతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు ఇష్టారీతిన వ్యవహరించి కాసులకు కక్కుర్తిపడడంతో ప్రధానంగా చింతలపాలెం, నెల్లికల్, తునికినూతల, తిమ్మాయిపాలెం రెవెన్యూ శివారుల్లో ప్రభుత్వ భూముల్లో కాస్తు కబ్జాలో లేనప్పటికీ సర్వే నెంబర్లలోని వాస్తవ విస్తీర్ణం కంటే అత్యధికంగా సుమారు 2వేల ఎకరాలకు పైగా అక్రమార్కులు పాస్ పుస్తకాలు పొందినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ప్రతీ రెవెన్యూ గ్రామ పరిధిలోని గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుకు సంబంధించిన బృందాలు

సర్వేలో వెలుగు చూసిన అక్రమాలు

ముందస్తుగా ఏరోజు ఏ సర్వే నెంబర్లలో, ఏ రెవెన్యూ సర్వే నెంబర్లలో సర్వే నిర్వహించనున్నారో ముందస్తుగా గతంలో ఎవరైతే పాస్ పుస్తకాలు పొందారో వారు ఖచ్చితంగా సంబంధిత సర్వే నెంబర్‌లోని తమ భూమి వద్దకు ఆధారాలతో రావాలని ఆదేశించారు. దీని వల్ల అక్రమార్కులు ఆధారాలులేకుండా పాస్ పుస్తకాలు పొందిన వందలాది మంది సర్వేలో పాల్గొనకపోవడంతో అనర్హులను ప్రకటిస్తూ సంబంధిత గ్రామపంచాయతీ నోటీస్‌బోర్డుల్లో వివరాలు సహా అంటించారు. దీంతో ఏయే సర్వే నెంబర్లలో ఎంతమంది గతంలో అక్రమంగా పాస్ పుస్తకాలు పొందారో ఎవరు అర్హులో,ఎవరు అనర్హులో అనే అంశంపై క్లారిటీతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం రాష్ట్ర యంత్రాంగానికి పూర్తి వివరాలను వివరించారు.

ఇకపై రిజిస్ట్రేషన్లకూ
స్లాట్ బుకింగ్

» 10 నుంచి 15 నిమిషాల్లో ప్రక్రియ పూర్తి

» పైలెట్ ప్రాజెక్టుగా భువనగిరి, చౌటుప్పల్ ఎస్ఆర్‌వోలు ఎంపిక

» రేపటి నుంచి మొదలు కానున్న నూతన విధానం

» త్వరలో ఉమ్మడి జిల్లాలోని మిగతా 13 కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్

రాష్ట్ర ప్రభుత్వం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానానికి శ్రీకారం చుడుతోంది. ఈ నూతన విధానంతో కేవలం 10 నుంచి 15 నిమిషాల్లోనే ప్రక్రియ పూర్తవుతుంది. ఆస్తుల క్రయవిక్రయదారులకు పారదర్శకత, అవినీతి రహితంగా మరింత మెరుగైన సేవలను సమర్థంగా అందించేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్‌తోపాటు బయోమెట్రిక్ విధానాన్ని తీసుకరానున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

ప్రస్తుతం ఒక డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు కనీసం గంట నుంచి గంటన్నర సమయం పడుతుంది. స్లాట్ బుకింగ్ విధానం అయితే 10 నుంచి 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. గత నెలలో హైదరాబాద్‌లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఆస్తుల క్రయవిక్రయదారులు డాక్యుమెంట్ల నమోదుకోసం గంటల తరబడి నిరీక్షించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీని దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆధునికీకరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ చార్ట్‌బోర్డు సేవలు వినియోగించుకోనున్నారు.

పైలెట్ ప్రాజెక్టుగా భువనగిరి, చౌటుప్పల్

పైలెట్ ప్రాజెక్టుగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్, భువనగిరి కార్యాలయాలను ఎంపిక చేశారు. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్...

- మిగతా 7వ పేజీలో...



ఎన్ని మిల్లులు తిరిగినా..

» ధాన్యం లోడు ట్రాక్టర్లతో మిల్లుమిల్లు తిరుగుతున్న రైతులు

» కొత్త నిబంధనలు పెడుతున్నారంటూ నార్కట్‌పల్లి- అద్దంకి హైవేపై రైతుల రాస్తారోకో

» మద్దతు ధర ఇవ్వడం లేదని శెట్టిపాలెంలో ఆందోళన



మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి రోడ్డులో రైస్‌మిల్లు ఎదుట బారులు తీరిన ధాన్యం లోడు ట్రాక్టర్లు

మిర్యాలగూడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన పంట విక్రయించేందుకు రైతులకు కష్టాలు మొదలయ్యాయి. ఎండనక.. వాననక.. కంటికి రెప్పలా కాపాడుకున్న పంటను కోతకోసి.. కుప్పనూర్చి.. మార్కెట్ తెస్తే కొనేవారు లేక ఒక చోట.. తాలు పేరుతో ఐదు రోజులుగా కాంటాలు ఆపుతున్నారని మరోచోట.. మద్దతు ధర ఇవ్వడం లేదని ఇంకో చోట.. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తమను పట్టించుకునేవారు కానరాకపోవడంతో రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంగళవారం ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. తిప్పర్తి మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డులో రైతులనుంచి కొనుగోలు చేసిన ధాన్యంలో ఎక్కువతాలు ఉందంటూ లోడ్ లారీలను మిల్లు నిర్వాహకులు దిగుమతి చేసుకునేందుకు నిరాకరించారు. దీంతో నార్కట్‌పల్లి-అద్దంకి హైవేపై రైతులు రాస్తారోకో చేశారు. మిల్లర్లు మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని వేములపల్లి మండలం శెట్టిపాలెం వద్ద రైతులు నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అదే విధంగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తమ్మర గ్రామ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కోదాడ పట్టణంలోని ఖమ్మం-కోదాడ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

- వివరాలు 7లో...

సన్న బియ్యంతో పేదలకు మేలు

● కలెక్టర్ ఇలాత్రిపాఠి



ఇందుగుల గ్రామంలో సన్న బియ్యం లబ్ధిదారు ఇంట్లో భోజనం చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మాడ్గులపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సన్న బియ్యం పథకంతో పేదలకు మేలు జరుగుతుందని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. మంగళవారం మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామంలో సన్న బియ్యం లబ్ధిదారురాలు రేఖా జానకమ్మ ఇంట్లో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, జిల్లా పౌరసరఫరాలశాఖ ఇన్‌చార్జి అధికారి హరీ‌ష్‌కుమార్‌తో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సన్నబియ్యం పథకం చరిత్రలో నిలిచిపోతుందని, గతంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత పథకం కింద దేశ వ్యాప్తంగా బియ్యం పంపిణీ చేసిందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉచిత బియ్యం పంపిణీ జరిగిందన్నారు.సన్నబియ్యం పథకంతో గ్రామాల్లో లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని, సన్న బియ్యాన్ని సక్రమంగా అన్ని రేషన్‌షాపులకు తరలించామన్నారు. తొమ్మిది ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద వెయ్యింగ్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశామని,ఎక్కడ లోపాలు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. అంతకుముందు కలెక్టర్ పాములపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవలను డాక్టర్ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో తాగునీటి సమస్య ఉందని కలెక్టర్‌దృష్టికి తీసుకురావడంతో తక్షణమే మోటార్, బోరును మంజూరు చేశారు. అంతేకాకుండా ఆసుపత్రికి వచ్చేరోగులకు ఇబ్బందుల్లేకుండా, వేసవి దృష్ట్యా రెండు ఏసీలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో తిరుమలస్వామి, వైద్యాధికారులు సత్యనారాయణ, సంజయ్, మాజీ జడ్పీటీసీ పల్లెంల సైదులు, గడ్డం పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, నాగరాజు, వెంకన్న పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందాలి

తిప్పర్తి: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్యం అందాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. తిప్పర్తి మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న నూతన భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలోని సిబ్బంది హాజరు పట్టిక చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డ్యూటీ డాక్టర్ మమతతో మాట్లాడుతూ ఓపీలు, వైద్య సేవలు, సమస్యల వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికంగా ఉన్న మోడల్ స్కూల్ లైబ్రరీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆమెవెంట డీపీవో వెంకయ్య, తహసీల్దార్ పరుషరాములు, ఎంపీడీవో ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ బి.సాయి ప్రశాంత్, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్: మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు, అధికారులతో ఈ నెల 11న నిర్వహించే జ్యోతి బాపూలే జయంతి వేడుకల ఏర్పాట్లపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహనీయుల జయంతులను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎదుళ్ల-డిండి పనులకు రూ.1800 కోట్లు

» పరిపాలన ఆమోదం జారీ చేసిన ప్రభుత్వం » దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, నీటిపారుదలశాఖ ఛీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్, అధికారులు

దేవరకొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1800 కోట్లు కేటాయించింది. ఎదుళ్ల నుంచి డిండి అనుసంధాన ప్రాజెక్టు పనులకు పరిపాలన ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దేవరకొండలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన నీటిపారుదలశాఖ, రెవెన్యూ ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిండి ఎత్తిపోతల, ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి ప్రాజెక్టుల ను పూర్తిచేసి జిల్లాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఎదుళ్ల రిజర్వాయర్ నుంచి సింగరాజుపల్లి, గొట్టిముక్కల, కిష్టరాయన్‌పల్లి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయడమే లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎదుళ్ల, ఉల్పర అనుసంధాన పనులకు రూ.1800.62 కోట్ల అంచనాలతో పరిపాలన ఆమోదం తెలిపినట్లు తెలిపారు. డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తయితే దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగునీరు అందుతుందన్నారు. జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ప్రాజెక్టుల కింద భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం కల్పించాలని అధికారులను కోరారు. ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందజేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్, స్పెషల్ కలెక్టర్ నటరాజన్, నీటి పారుదలశాఖ సీఈ అజయ్‌కుమార్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, చండూరు ఆర్డీవో శ్రీదేవి పాల్గొన్నారు.

25వేల ఎకరాల ఆయకట్టు పెంచే
దిశగా ప్రణాళిక

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



బ్రాహ్మణ వెల్లంల లెఫ్ట్ మెయిన్ కెనాల్ ప్రణాళికను మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి చూపుతున్న అధికారులు

మునుగోడ రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మునుగోడును సస్యశ్యామలం చేసేందుకు ఉరుమడ్ల గ్రామం నుంచి కిష్టాపురం వరకు 11.5 కిలోమీటర్ల మేర బ్రాహ్మణ వెల్లెంల లెఫ్ట్ మెయిన్ కెనాల్ విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఉదయ సముద్రం అధికారులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మునుగోడు మండలంలో కృష్ణానీటితో 25వేల ఎకరాల ఆయకట్టును పెంచే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం ఉరుమడ్ల గ్రామం వరకే ఉన్న బ్రాహ్మణ వెల్లెంల లెఫ్ట్ మెయిన్ కెనాల్‌ను కిష్టాపురం గ్రామం వరకు 11.5కిలోమీటర్ల మేర విస్తరించి వీలైనంత ఆయకట్టుకు నీటిని అందించే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు మొదలు పెట్టాలన్నారు. భవిష్యత్తులో అవసరమైతే కిష్టాపురం చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చుకొని అక్కడి నుంచి ఎగువ ప్రాంతానికి లిఫ్టుల ద్వారా నీరందించాలన్నారు. ఈ సమావేశంలో ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డీఈ విటలేశ్వర్, ఏఈఈ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

బహిరంగ సభను
విజయవంతం చేయాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్



బీఆర్ఎస్ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవీంద్రకుమార్

దేవరకొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ ఆవిర్భావ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. దేవరకొండలో మంగళవారం బహిరంగసభ పోస్టర్‌ను విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా వ్యతిరేకతను వరంగల్ సభ వేదికగా ఎండగడుతామన్నారు.

పార్టీ ఆవిర్భావ రజతోత్సవాల్లో భాగంగా పల్లెలు, పట్టణాల్లో గులాబీ జెండాలు ఎగరవేయాలని కోరారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం పేద ప్రజల జీవితాలను నాశనం చేసిందన్నారు. రుణమాఫీ చేస్తామని రైతులకు మాయమాటలు చెప్పి పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జర్పుల లోక్యనాయక్, మాధవరం జనార్ధన్‌రావు, గాజుల రాజేష్, కేతావత్ శంకర్‌నాయక్, కేతావత్ రవీందర్, బొడ్డుపల్లి కృష్ణ, జానిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా కార్లు ఢీ : ఒకరి మృతి

● 11 మందికి గాయాలు

● మృతుడు బోడుప్పల్ వాసి



6

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

అదనపు పీడీ నవీన్‌కుమార్



కమ్మగూడెం నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అదనపు పీడీ నవీన్ కుమార్

మర్రిగూడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం పనులను పారదర్శకంగా చేపట్టాలని జిల్లా అదనపు పీడీ నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని లెంకలపల్లి, కమ్మగూడెంలో చేపడుతున్న భూమి అభివృద్ధి పనులు, నర్సరీలను మంగళవారం ఆయన పరిశీలించారు. కమ్మగూడెం నర్సరీలో పని చేస్తున్న మహిళా కూలీతో మాట్లాడారు. రోజు వారీగా కూలి ఎంత వస్తుందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు వంద రోజుల ఉపాధి పనులు కల్పించి రోజుకు రూ.307 కూలి వచ్చే విధంగా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు, ఉపాధి అధికారులకు సూచించారు. కూలీలకు ఉపాధి కల్పించడంతో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా వేసవిలో నర్సరీలో పెట్టిన మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించి వాటిని పరిరక్షించాలన్నారు. ఆయన వెంట ఏపీడీవో యామిని, ఎంపీడీవో మున్నయ్య, ఏపీవో వివేక్, ఫీల్డ్ అసిస్టెంట్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీపీఎం డి.మోహన్‌రెడ్డి

కనగల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీపీఎం డి. మోహన్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని కనగల్, పర్వతగిరి, కురంపల్లి, జీఎడవల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. నిర్వాహకులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాంటా వేసిన ధాన్యం బస్తాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని సూచించారు. కొనుగలు కేంద్రాల వద్ద రైతులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సంకు హరి, సీసీలు ప్రభాకర్, విజయ, వసంత, సీఆర్‌పీ జానకి తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఏఈ బదిలీ

పెద్దఅడిశర్లపల్లి,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పెద్దఅడిశర్లపల్లి మండల విద్యుత్ అధికారిగా విధులు నిర్వర్తించిన ఓర్సు కావ్య మంగళవారం బదిలీ అయ్యారు. ఆమెను నల్లగొండ కనెక్షన్ ఏఈకి బదిలీ చేశారు. పీఏపల్లి మండలానికి విద్యుత్ ఇన్‌చార్జి ఏఈగా సబ్ ఇంజనీరింగ్ రమేష్‌కు బాధ్యతలు అప్పజెప్పారు. పలువురు విద్యుత్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

'రైతులకు బోనస్ ఉన్నా ఆచరణ సున్నా'

హాలియా, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక వాగ్దానాలు చేసి ఆచరణలో నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని స్వామి నాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరెల్లి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో వివిధ ఐకేపీ సెంటర్లను మంగళవారం ఆయన పరిశీలించారు.

గోడబండతండాలో తీరిన తాగునీటి సమస్య

- కలెక్టర్ ఆదేశాలతో బోరుకు మరమ్మతు



మరమ్మతు నిర్వహిస్తున్న అధికారులు

దేవరకొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోడబండతండాలో తాగునీటి మోటర్ మరమ్మతుకు గురైందని తండావాసులు ఇటీవల కలెక్టర్ ఇలా త్రిపాఠికి ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్, నీటి పారుదల శాఖ అధికారులకు 24 గంటలలో బోరు మోటర్‌ను మరమ్మతు చేపట్టి తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. వెంటనే బోరు మోటర్‌ను మరమ్మతు చేపట్టి నీటిని సరఫరా చేశారు. కలెక్టర్ ఆదేశాలతో గోడబండ తండాలో బోరు మరమ్మతు నిర్వహించడంతో సమస్య పరిష్కారమైందని తండావాసులు తెలిపారు.

చలివేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

దేవరకొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి మైనంపల్లి మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమిరాంసింగ్ నాయక్, మర్రిచెట్టుతండా మాజీ సర్పంచ్ నేనావత్ శ్రీను నాయక్ అన్నారు. మండలం మర్రిచెట్టుతండాలో ఎంఎస్ విద్యామందిర్ స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, మజ్జిగ పంపిణీ కేంద్రాలను మంగళవారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో చిన్ననాయక్, కీర్తి, చంద్యా, గుండ్య పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న ఖలేద్ సైపుల్లా

మిర్యాలగూడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం కావాలని కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర వైస్‌చైర్మన్ ఖలేద్ సైపుల్లాహ్ పిలుపు నిచ్చారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో వక్ఫ్ బిల్లోను వ్యతిరేకిస్తూ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని తెచ్చిందన్నారు. దేశంలో అనేక మంది ప్రజలు దీనిని వ్యతిరేకిస్తున్నప్పటికీ పార్లమెంట్‌లో ఎంపీల బలంతో బిల్లును ఆమోదింప చేసుకున్నారని అన్నారు. బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ చివరివరకు పోరాడి నప్పటికీ మెజార్టీ లేకపోవడంతో బిల్లు పాసైయిందన్నారు. బిల్లు రద్దు కోసం న్యాయస్థానం ద్వారా పోరాడుతామని అన్నారు. బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 13న హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై వక్ఫ్‌మార్చ్ నిర్వహిస్తున్నందున్న అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మమద్ సిరాజుద్దీన్, జిల్లా చైర్మన్ ఎం.ఎ.సలీం, ఎన్‌ఎస్ యూఐ జిల్లా అధ్యక్షుడు చాంద్‌పాషా, సత్మాన్, జానీ, సమావుల్లా పాల్గొన్నారు.

బంజారా భవన్ ఆక్రమణ సరికాదు



మాట్లాడుతున్న ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు

నాగార్జునసాగర్ ,ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ హిల్‌కాలనీలో ఉన్న ఏఈ 105 నంబరు గల బంజారా సంఘం భవన్‌ను కొందకు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకోవాలని చూస్తున్నారని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సాగర్ నియోజక వర్గ నాయకులు అన్నారు. మంగళవారం సాగర్ హిల్‌కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 1997లో నీటిపారుదల శాఖ అధికారులు ఏఈ 105 నంబరు గల క్వార్టర్‌ను బంజారా సంఘానికి అందజేశారని అన్నారు. ప్రస్తుతం ఆ భవ నాన్ని కొందరు వ్యక్తులు అక్రమించుకోవాలని చూస్తున్నారని అది సరికాదన్నారు. బంజార సంఘం భవన్ ఆక్రమించాలని చూస్తున్న అక్రమదారుల నుంచి విడిపించాలని కోరారు. కార్యక్రమంలో సక్రునాయక్, రవినాయక్, చంద్రమౌళీ నాయక్, నరేష్ నాయ ఎక్, సీతారాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నెరవేరనున్న కల

(5వ పేజీ తరువాయి)

చేశారు. ఈవిధంగా మండలంలో ఉన్న ప్రభుత్వ, అటవీ భూములను సేద్యం చేస్తున్న, ప్రధానంగా భూ సమస్యలు ఉన్న చింతలపాలెం, జమ్మనకోట, నెల్లికల్, తిమ్మాయిపాలెం, తునికి నూతల రెవెన్యూ గ్రామాలను మొదటగా పకడ్బందీగా నిర్వహించారు. అదేవిధంగా సాగర్ ప్రాజెక్టులో పునరావాస గ్రామాలైన నాగార్జున పేటతండా, గోడుమడక, చెన్నాయిపాలెం, గట్టుమీదితండా, సుంకిశాల గ్రామాలను పర్యటించి వారి వద్ద, ప్రభుత్వం వద్ద లభ్యమైన డీ ఫారెస్ట్ పట్టాల ఆధారంగా సర్వే నిర్వహించి రైతులను గుర్తించారు. అదే విధంగా చింతలపాలెం, తిమ్మాయిపాలెం రెవెన్యూ గ్రామాల్లోని పది సర్వేల్లోగల సుమారు 2,800 ఎకరాల్లో ఉన్న కాందిశీకుల భూముల్లో కబ్జాలో ఉన్న రైతులను గుర్తించేలా సర్వే నిర్వహించారు. అనంతరం మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ బృందాలు పర్యటించి ప్రభుత్వ భూములను సేద్యం చేస్తున్న రైతులను గుర్తించేలా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి చర్యలు చేపట్టారు.

సుదీర్ఘంగా కొనసాగిన ప్రక్రియ

ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ పైలట్ ప్రాజెక్టును విజయవంతం చేసేందుకు కలెక్టర్లు నారాయణరెడ్డి, ఇలాత్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, గతంలో చండూరు ఆర్డీవోగా పనిచేసిన సుబ్రహ్మణ్యంతో పాటు జిల్లా సర్వే విభాగాధికారి శ్రీనివాస్‌తోపాటు పలువురు తహసీల్దార్లు, రెవెన్యూ సర్వేయర్లు సుమారు ఆరు నెలలపాటు శ్రమించారు. వీరికి సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ మార్గదర్శకాలను నిరంతరం చేస్తుండడంతో రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన ఒక కొలిక్కి వచ్చింది. ఈక్రమంలోనే అర్హులైన రైతులను గుర్తించి గ్రామాలవారీగా జాబితాను నోటీస్ బోర్డుల్లో ప్రకటించారు. అనంతరం సదరు రైతుల ఆధార్‌కార్డులు, వారి వద్ద ఉన్న భూమి ధ్రువపత్రాలతో మీసేవా ద్వారా ఆన్‌లైన్ చేయించి ప్రక్రియను ఒక కొలిక్కి తీసుకొచ్చారు. ఈ క్రమంలో మంగళవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అసైన్‌మెంట్ కమిటీ సమావేశమై 13 గ్రామాలకు చెందిన 4,500 మంది రైతులకు చెందిన 4వేల ఎకరాలకు లావుని పట్టాలు జారీ చేసేలా నిర్ణయించడంతోపాటు త్వరలో ప్రక్రియను ముగించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఒక సభను ఏర్పాటుచేసి ఈ ప్రాంత పేద రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను సీఎం అందజేయనున్నట్లు సమాచారం.

ఎన్నో ప్రయోజనాలు కోల్పోయాం



మేము కాస్తులో ఉండి సేద్యం చేస్తున్నప్పటికీ వివాదస్పద భూములుగా నమోదు కావడంతో ఎనిమిదేళ్లుగా ప్రభుత్వ భూములకు పాస్ పుస్తకాలు పొందలేక పోయాం. రెవెన్యూ పైలట్ ప్రాజెక్టు వల్ల మమ్మల్ని రైతులుగా గుర్తించి పాస్ పుస్తకాలు ఇవ్వబోతుండడం ఆనందంగా ఉంది.

-రమావత్ హనుము, తిమ్మాయిపాలెం

పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి



చింతలపాలెం, తిమ్మాయిపాలెం రెవెన్యూ శివారుల్లో వందలాది మంది రైతులు కాందిశీకుల భూముల్లో సేద్యం చేసుకుంటున్నారు. గతంలో మాకు ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా ప్రయోజనాలు అందాయి. కానీ ఎనిమిదేళ్లుగా ఆ భూములపై హక్కులను కోల్పోవడంతో రైతుభరోసా, రైతుబీమా, బ్యాంకుల నుంచి రుణాలు, సబ్సిడీలు పొందలేకపోతున్నాం. ప్రభుత్వం మాకు కూడా పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. -మెగావత్ నాగేందర్‌నాయక్, నాయకునితండా

సామాజిక మార్పు లక్ష్యంగా మిషన్ పరివర్తన్

● సదస్సులతో అవగాహన కల్పిస్తున్న పోలీస్ యంత్రాంగం ● పట్టణ శివారు కాలనీపై డ్రోన్

యువతలో సామాజిక మార్పే లక్ష్యంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మిషన్‌పరివర్తన్ కార్యక్రమం పేరుతో పోలీస్ యంత్రాంగం క్షేత్రస్థాయిలో యువత ఆలో చనలో మార్పు తెచ్చేందుకు అవగాహన సదస్సులు నిర్వ హిస్తోంది గంజాయి వినియోగం, సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ట్రాఫిక్ నిబంధనలు తది తర అంశాలపై చైతన్య కల్పిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ అర్బన్)



మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్న పోలీసులు(ఫైల్)

మత్తు పదార్థాల వినియోగంతో యువత విచక్షణ కోల్పోయి ప్రవరిస్తున్న నేపథ్యంలో నేరాల సంఖ్య పెరుగుతోంది. దీనిని నియం త్రించే ప్రయత్నంలో భాగంగా సామాజిక స్పృహ కలిగిన వారంతా పోలీస్‌లకు పరోక్షంగా సహకరించేలా అవగాహన సదస్సులు నిర్వహిస్తు న్నారు. ప్రధానంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి వినియోగంతో పాటు సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ట్రాఫిక్ నిబం ధనలు తదితర అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించి మిషన్‌పరివర్తన్ ద్వారా చైతన్యం కల్పిస్తున్నారు. ఇందుకు మార్నింగ్ వాకర్స్, సామాజిక కార్యకర్తలు, విద్యావంతులు, సీనియర్ సిటిజన్స్, యువజన సంఘాలు, స్వచ్ఛందసంస్థల సామాజిక మార్పులో భాగ స్వాములను చేయాలన్న ఆలోచన చేశారు. దీంతో మిర్యాలగూడ డివిజన్ పరిధిలో మిషన్‌పరివర్తన్ కోసం డీఎస్పీ రాజశేఖర్‌రాజు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ప్రజల మద్దతును కూడగడుతున్నారు.

తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్

పట్టణీకరణ నేపథ్యంలో శివారుకాలనీలో ఆకతాయిల అలజడి పెరుగుతోంది. ప్రధానంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యంతాగి, ప్రజాశాంతికి భంగం కలిగిస్తున్నారు. దీనిపై నిత్యం పోలీసులకు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో బహిరంగ ప్రదేశాలపై ప్రత్యేక దృష్టిసారించారు. శివారు కాలనీ డ్రోన్ కెమెరాలతో నిఘా పెంచి మద్యపానం, గంజాయి తదితర మత్తు పదార్థాలను వినియోగిస్తున్న యువతను గుర్తించి అదుపులోకి తీసుకుంటున్నారు. డీఎస్పీ పర్యవేక్షణలో ఈనెల 1న పట్టణ పోలీసులు బృందాలుగా విడిపోయి శివారుకాలనీలో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న యువ కులను పదుల సంఖ్యలో అదుపులోకి తీసుకొని ప్రత్యేక కౌన్సెలింగ్ చేశారు. యువకుల తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా యువకుల్లోనూ మార్పు వస్తున్నట్లుగా పోలీసులు భావిస్తున్నారు. శివారుకాలనీలు, బహిరంగ ప్రదేశాల్లో డ్రోన్ నిఘా పెంచడంతో ఆయా కాలనీ వాసుల్లో అభద్రతా భావం తొలగిపోయింది. దీంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ప్రజలు సహకరించాలి



అసాంఘికశక్తుల ఆట కట్టించడమే ధ్యేయంగా పని చేస్తున్నాం. యువత మత్తుపదార్థాలకు అలవాటుపడి నేరాలు చేసేందుకు వెనకాడడం లేదు. దీన్ని సమూలంగా నియంత్రించాలన్న లక్ష్యంతో ముందుకుకెళ్తున్నాం. పోలీస్ చర్యలకు ప్రజలతో పాటు సామాజిక బాధ్యత కలిగిన వారంతా స్వచ్ఛందంగా సహకరించాలని కోరుతున్నాం. జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ సరికొత్త ఆలోచనతో చేపట్టిన మిషన్‌పరివర్తన్‌తో ప్రజల్లో చైతన్యం పెరిగింది. గంజాయి వినియోగం, అక్రమ దందాలపై తమకు సహకరిస్తున్న తీరు అభినందనీయం.

- రాజశేఖర్‌రాజు,డీఎస్పీ, మిర్యాలగూడ

పోలీస్ చర్యలు మరింతగా బలపడాలి



ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు శివారుకాలనీలో పోలీస్ చర్యలు మరింతగా బల పడాలి. గంజాయి నియంత్రణ, అక్రమ దందా లను అరికట్టడంతోపాటు అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించేందుకు పోలీసులు చేపడుతున్న చర్యలు అభినందనీయం. యువతలో మార్పు తెచ్చేందుకు ఎస్పీ మిషన్ పరివర్తన్ కార్యక్రమానికి విశేష ప్రజా స్పందన లభిస్తోంది.

-చేగొండి మురళి యాదవ్ (సామాజిక కార్యకర్త, మిర్యాలగూడ)

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



అల్వాలలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి.

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అల్వాల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు రైతు భరోసాతోపాటు పంటలకు బోనస్ అందించే పథకాన్ని అమలు చేస్తుందన్నారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తీసుకొచ్చిన రైతులకు అసౌకర్యం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, డీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గడ్డం సాగర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పెంకీస్ పాపిరెడ్డి, చిట్టెం రాఘవరెడ్డి, పల్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పల్‌రెడ్డి రాంరెడ్డి, ఏవో హర్షిత, ఆర్ఐ లక్ష్మీకాంత్, ఏపీఎం నరసింహా, షేక్‌జాని పాల్గొన్నారు.

● హాలియా : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అనుముల మండల వ్యవసాయాధికారి సరిత అన్నారు. మంగళవారం అనుముల మండలం యాచారం గ్రామంలో రైతు స్వయంకృషి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈవో అరవింద్, ఎఫ్ డైరెక్టర్లు కాసాని జానయ్య, చెదురుబెల్లి రాములు, సీఈవో ఎం.నర్సింహ పాల్గొన్నారు.

● నిడమనూరు : రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, వెనిగండ్ల సింగిల్ విండో చైర్మన్ కేవీ రామారావు అన్నారు. మంగళవారం మండలంలోని రాజన్నగూడెం, సూరేపల్లి గ్రామాల్లో వెనిగండ్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీఈవో నలపరాజు వెంకన్న, ఏఈవో తనూజ, నాయకులు నందికొండ మట్టారెడ్డి, వల్లభరెడ్డి, దయాకర్‌రెడ్డి, శివ మారయ్య, కొండా శ్రీనివాస్‌రెడ్డి, పోలె రవి ఉన్నారు.

శక్రునాయక్ మృతికి ఎమ్మెల్యే నివాళి

చందంపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): చందంపేట మాజీ ఎంపీపీ పార్వతీచందు నాయక్ మామ నున్సావత్ శక్రునాయక్ మంగళవారం మృతి చెందారు. శక్రునాయక్ మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలునాయక్ ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శక్రునాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బద్య నాయక్, పీఏసీఎస్ చైర్మన్ కొండ శ్రీశైలం, గోసుల అనంతగిరి, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, బీఆర్ఎస్ నాయకులు కేతావత్ బీల్యానాయక్, శక్రునాయక్ మృతదేహానికి నివాళులర్పించారు.

బుర్రకథ ప్రదర్శనకు విశేష స్పందన




చింతపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) :శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని గొడకొండ్లలో ఆంజనేయ స్వామి ఆలయంలో గ్రామానికి చెందిన కళాకారులు వీరబ్రహ్మేంద్రస్వామి బుర్రకథ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరనగర్‌కు చెందిన బాణాల రంగాచారి, ఆచారి, లక్ష్మయ్య ముగ్గురు కలిసి గొడకొండ్లలోని రచ్చబండ వద్ద వీరబ్రహ్మేంద్ర స్వామి బుర్రకథ అద్భుతంగా వివరించారు. కార్యక్రమానికి గొడుకొండ్ల, పోలేపల్లి, వీ.టి నగర్‌కు చెందిన ప్రజలు పాల్గొన్నారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. సమాజంలో కళాకారులకు గుర్తింపు ఉంటుందని ఆలయ కమిటీ తెలపారు.

త్వరలో పులిచర్లలో ఐకేపీ సెంటర్

పెద్దవూర, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిచర్ల గ్రామ రైతులు తమ హక్కుల సాధనకు మరో ముందడుగు వేశారు. ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు గ్రామంలో ఐకేపీ కొనుగోలు సెంటర్‌ను ఏర్పాటు చేయాలని పులిచర్ల గ్రామస్థులు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించగా సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ స్పందించి త్వరలోనే గ్రామంలో ఐకేపీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని హామి ఇవ్వడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బొడ్డుపల్లి చంద్రశేఖర్, కంభంపాటి కృష్ణ, సత్యనారాయణ, వీరబోయిన వెంకటయ్య పాల్గొన్నారు.

ఆసుపత్రిలో మౌలిక వసతులు లేక ఇక్కట్లు



ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన తాగునీటి ఫ్రిడ్ (ఇన్‌సెట్‌లో) ఫ్రిడ్జ్‌లో తెల్లపురుగులు

నాగార్జునసాగర్, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ కమలా నెహ్రూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మౌలిక వసతులు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. రూ.18 కోట్ల తో నూతన భవనం నిర్మించి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేలా అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తూ నిర్మించారు. కానీ ఆసుపత్రిలో దాహం వేసినా గుక్కెడు నీళ్ల తాగుదామంటే ఏం కొత్త రోగం వస్తుందో అని భయపడాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. సోమవారం ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చిన ఓ రోగి నీళ్ల తాగుదామని ఫ్రిడ్జ్ వద్దకు వచ్చి గ్లాసులో నీటిని పట్టుకోగా అందులో తెల్లని పురుగులను గమనించాడు. దీంతో సదరు వ్యక్తి ఫ్రిడ్జ్ వైపు మూతను సీఈవో చూడగా నీటిలో అన్ని తెల్లని పురుగులు కనిపించడంతో కంగుతిన్నాడు. దీంతో అక్కడ ఉన్న సిబ్బందిని ఇందేంటని ప్రశ్నించగా ఎలా వచ్చాయో తమకు తెలియదని సమాధానం ఇచ్చారని సదరు వ్యక్తి వాపోయాడు. ఈ విషయంపై ఆసుపత్రి సీఎంవో డాక్టర్ హరికృష్ణను ఫోన్‌లైన్‌లో వివరణ కోరగా ఏదో పొరపాటు జరిగి ఉండ వచ్చునని, ఫ్రిడ్జ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నామని తెలిపారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా చూస్తామని తెలిపారు.

హిజ్రాలకు కౌన్సెలింగ్

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై వాహనాలు ఆపి డబ్బులు వసూలు చేస్తున్నారని, ఇవ్వకపోతే దూషిస్తున్నారని వాహనదారులు గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఎస్ఐ నర్సింహులు స్టేషన్‌లో వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. హిజ్రాలు చదువుకుని సమాజంలో గౌరవంగా బతకాలని సూచించారు. వాహనదారులు, ప్రజలను భిక్షాటన చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇలాంటి వాటికి స్వస్తి పలకాలన్నారు. పోలీసుల సూచనలను హిజ్రాలు పాటించాలన్నారు. శుభకార్యాలు, రోడ్లపై గుంపులుగా వెళ్లి యాచన పేరుతో డబ్బు వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిధులు దుర్వినియోగం చేశారు

● కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన సంఘ సభ్యులు



కమిషనర్ యూసుఫ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘ సభ్యులు

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్లమ్ లెవల్ ఫెడరేషన్ (ఎస్ఎల్ఎఫ్)నిధులు దుర్వినియోగం చేశారంటూ పట్టణంలోని 32వ వార్డు సమభావన సంఘ సభ్యులు మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘ సభ్యులు పొదుపు చేసిన ఇచ్చిన సుమారు రూ. 6 లక్షలు లెక్కలు అడిగితే చెప్పడం లేదని, సమావేశాలకు హాజరు కావడం లేదన్నారు. సదరు డబ్బును సంఘ అధ్యక్షురాలు దుర్వినియోగం చేసినట్లు ఆరోపిస్తూ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో షరీఫా, ఆసియా, సల్మా, చాంద్‌సుల్తానా, బేగం తదితలున్నారు. కాగా నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి రిపోర్ట్ అందజేయాలని మెప్మా టీఎంసీ బక్కయ్యను ఆదేశించినట్లు కమిషనర్ తెలిపారు.

మతా, శిశు సంరక్షణతో బలమైన భారతం

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మతా, శిశు సంరక్షణతో బలమైన భారతం నిర్మించవచ్చని మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్తహీనత, బలహీనత సమస్య చిన్నారులు, బాలికలపై ప్రభావం చూపు తుందన్నారు. సీడీపీవో మమత మాట్లాడుతూ ఏప్రిల్ 22 వరకూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. మునిసిపల్, హెల్త్ శాఖల సహకారంతో నిర్వహించే పక్షోత్సవంలో చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదల, బరువు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో అధికారులు వెంకటరమణ, జ్ఞానేశ్వరి, రమేష్ పాల్గొన్నారు.

పోషణ పక్వాడ్‌ను విజయవంతం చేయాలి

చింతపల్లి, అడవిదేవులపల్లి, హాలియా, పెద్ద అడిశర్లపల్లి : అంగన్వాడీ కేంద్రాల్లో మంగళ వారం నుంచి ఈ నెల 22 వరకు నిర్వహించనున్న పోషణ్ పక్వాడ్‌ను విజయవంతం చేయాలని సీడీపీవోలు సక్కుబాయి, చంద్రకళ ఉదయశ్రీ పిలుపు నిచ్చారు. చింతపల్లి, అడవిదేవులపల్లి, హాలియా, పెద్దఅడిశర్లపల్లి ఎంపీడీవో కార్యాల యాల్లో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. కార్యక్రమాల్లో భాగంగా అన్నీ అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణి బాలింతలతో పాటు కిషోర బాలికలకు పోషక పదార్థాలు అవగాహన కల్పించాలని వారు సూచించారు. అడవిదేవులపల్లిలో పోషణ పక్వాడ పోస్టర్‌ను ఆవి ష్కరించారు. చింతపల్లిలో ఎంపీడీవో సుజాత, వైద్యాధికారి శ్రీదేవి, సూపర్‌వైజర్ పార్వతి, ఏపీఎం విజయలక్ష్మి, అడవిదేవుపల్లి లో ఎంపీడీవో సుజాత, ఎంఈవో వరలక్ష్మీ, సీహెచ్‌వో షాహిద్, ఏపీఎం శేషయ్య, అశ్రిత పాల్గొన్నారు.

● వేములపల్లి : మండలంలో నేటి నుంచి నిర్వహించే పోషక పక్షవారోత్సవాలను మండల స్థాయి వివిధ శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేయనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన రాష్ట్రీయ పోషణ్ పక్వాడ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో శారదాదేవి, డాక్టర్ సుచరిత, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, డీటీ కోటేశ్వరి, ఎంపీవో లలిత, ఏపీఎం నిజాముద్దిన్, ఏపీవో మిరాజుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి : గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సీడీపీవో సరళ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తబావి, గుమ్మడవెల్లి, చిన్నఅడిశర్లపల్లి గ్రామాల్లో అంగన్‌వాడి కేంద్రాల్లో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏసీడీసీవో సరళ, అ సూపర్‌వైజర్ వరలక్ష్మీ, వైద్య సిబ్బంది రసూల్, గిరి, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర అందేలా చూడాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్

మిర్యాలగూడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు మద్దతు ధర అందేలా చూడాలని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ డివిజన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మిల్లు కొనుగోలు పాయింట్ల వద్ద పర్యవేక్షణ విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. 24 మిల్లు ప్రాంతాల్లో 13 ఆర్‌ఐలు ఏప్రిల్ 9న బుధవారం నుంచి ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఫాం బీ రిజిష్టర్‌లో నమోదు చేయించడం, రైతులకు మద్దతు ధర ఇప్పించడం పనులను పర్యవేక్షించాలని సూచించారు. ధాన్యం లోడ్ వాహనాలు రోడ్డుమీదకు రాకుండా, అధిక సంఖ్యలో వచ్చిన వాహనాలను తక్కువ రద్దీ ఉన్న మిల్లులకు పంపడం, మిల్లుల వద్ద లా అండ్‌ఆర్డర్ సమస్య ఉత్పన్నం కాకుండా సివిల్‌సప్లయ్ నాయబ్ తహసీల్దార్ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు